శ్రీ

రుక్మాంగదచరిత్రము.

లేక

ఏకాదశీమహాత్మ్యము.

ఇది

బళ్ళారి జిల్లా బళ్ళారి డి. మునసఫ్ కోర్టు వకీలుగానుండిన
కీ. శే. బ్ర. శ్రీకోలాచలం శ్రీనివాసరావుచే

రచియింపబడిన

పురాణకథ.

ఇది వారిజ్యేష్ఠపుత్రుఁడగు కో. శత్రుఘ్నరావుచే
ప్రకటింపబడెను.

రెండవ కూర్పు.

1920.

వెల. 1—4—0. పోస్టేజి. 0—1—0.

రుక్మాంగదచరిత్రము.

— నాంది —

— సూత్రధారుఁడు —

శా॥ శ్రీరామా మణిమంజులాస్య వరద శ్రీరాగ సంయుక్తయై
నీరేజాసన పాకశాసన సురానీకస్తుతిన్ మించుచున్
శ్రీరుక్మాంగద ముఖ్యభక్త వితతిన్ శీలాబ్ధిఁ గాఁ జేయుచున్
మేలౌ ధీనిధి వాయునందనుఁడు సమ్మోదాయురారోగ్యముల్॥

గీ॥ ఇట్టి కోలాచల స్వయంభువు లైనాథ
సూరివంశోద్భవుండయి భూరికీర్తి
వరుఁడుఁ గానుండు శ్రీ శ్రీనివాసగురు కవి
చేసెనీ నాటకంబును వాసిమీఱ॥

Songs, Errata, Title page & wrapper are
printed at K. R. Press Madras,
Others at Vani Vilasa Press, Bellary.

"శ్రీనివాసోవిజయతేతరాం"

పీఠిక.

అఖిలరసికశేఖరులారా!

శ్లో॥ యద్వేదాధ్యయనం, తథోపనిషదాం, సాంఖ్యస్య యోగస్య చ।
జ్ఞానం, తత్కథనేన కిం నహి తతః కశ్చిద్గుణో నాటకే।
యత్ప్రౌఢిత్వముదారతా చ వచసాం, యచ్చార్థతో గౌరవం।
తచ్చేదస్తి తతస్తదేవ గమకం, పాండిత్యవైదగ్ధ్యయోః॥

అని సుకవితారాజ్య సార్వభౌముఁడగు శ్రీభవభూతి మహాకవి చెప్పినచందమున, మన శ్రీనివాస కవివర్యునకు నుండు నాంగ్లేయాది నిఖిలభాషానిష్ణాతత్వము, వేనాఁటవివిధగ్రంథ పరిశోధన జన్యపాండిత్య ప్రాకవిశేషము, రసికజన సమాజమనోవశీకరణ చణ బహుసరసార్థ రచన చాతుర్యము, అసమానలౌకిక మనీషా లసమానత్వము నన్నగుణగానముల నిచ్చటఁగొనియాడిన నవిప్రకృత నాటకగ్రంథమునకు నుత్కర్షావహములు కానేరవు. కావున నవ్వాని పొంతఁబోక కబ్బమునకు వన్నెయు, వాసియుఁదెచ్చు వాక్ప్రౌఢిమ, పదలాలిత్యము, అర్థగౌరవము, భావగాంభీర్యము, రసపరిపోషకత్వము, మొదలగు విషయములఁగూర్చి ముచ్చటించుటయే ముఖ్యముగానున్నది. అయినను అధునాతన పీఠికారచయితలసరణి ననుసరించి, మనకవికుంజరుఁడు నాఁడాపు 4–5 మాసములక్రిందటఁ గాలగతినొందిన సుప్రసిద్ధమహాపురుషుఁడయ్యె నతని జీవితచరిత్రమును సంగ్రహముగ వ్రాయ సమకట్టితి.

—(*) శ్రీనివాససుకవి జన్మభూమి నిర్ణయము. (*)—

ఎవ్వానివలన రాజీవరంగస్థలంబున నలువరాణి విచ్చలవిడి నట్టువలు సలుపుచుండునో! ఎవ్వాఁడు [illegible]

కాళిదాస కవితాసుకన్యకను దనదుసంజీవినిచేఁ జివ్వితెల్లఁజేసి, పజ్జలమిన్నయని వన్నెకెక్కెనో! ఏమహామహుని దివ్యనామామృతము వీనులారఁగ్రోలని యక్షరాస్యుఁడొక్కఁడైన నీభువినిగానంబడఁడో! ఏమహితచారిత్రుని యశఃకుసుమంబుల ధరియించి దివాకర నిశాకరులు పుష్పవంతులను సార్థకనామమును బడసిరో!

ఏవిద్వద్వతంసుఁడు అనన్య జనసామాన్యమగు మహామహోపాధ్యాయ బిరుదమునకు మార్గదర్శియయ్యెనో! అట్టిచుళుకీకృత సకల శాస్త్రజలధియగు కోలచల శ్రీమల్లినాథసూరి వంశమున మనశ్రీనివాస కవిముక్తామణి విరూపాక్షక్షేత్రమునకుసమీపమునసుండు కామాలాపుర మను గ్రామమునఁ గ్రీస్తుశకం 1854–3–13 తేదీలకు సరియగు ప్రమాదీచ సంవత్సర ఫాల్గుణాసిత చతుర్దశినాఁడుద్భవించె. ఇతఁడు బాల్యమునసే సంస్కృతభాషను జక్కఁగనభ్యసించి, పిదప నాంగ్లేయభాషయందసమానమైనపష్యమును గడించి, కొంతకాలము రాజకీయోద్యోగిగనుండి, తర్వాతన్యాయవాదిపరీక్షలయందుత్తీర్ణుఁడై, బలారిపురవరమున న్యాయవాదిగ వెలుగుచుండె. ఇతనికి నొకకూఁతురును, నలుగురు కుమారులును, గలరు. మఱియు నితఁడు 1917 సం॥ ఏప్రేల్ 7 తేది దేవారీపురమున జరిగిన విద్వత్సభయని ప్రసిద్ధిఁగాంచిన యాంధ్రసాహిత్యపరిషత్సభ కగ్రాసనాధిపుఁడుగ నియమింపఁబడియుండె ఇట్లుండ నేతత్కవిచంద్రుఁడు రాజవ్రణపీడితుఁడై యాంధ్రకువలయంబు వసివాఁడఁగ కవిచక్రంబు ఘల్లసిల్ల 1919 సం॥ జూను 23 తేది యస్తమించె.

—(*) ఏతత్కవికృతములగు నితర గ్రంథములు. (*)—

సునందనీ, శిలాదిత్య, ప్రతాపరుద్రీయము, విజయనగరసామ్రాజ్యనాశనము, మొదలగు చరిత్రనాటకములును, శిరోమణి, ప్రహ్లాద, పాదుకాపట్టాభిషేకము, సత్యహరిశ్చంద్రీయము, మున్నగు పురాణ నాటకములును, కొన్ని ప్రహసనగ్రంథములును, శ్రీమచ్ఛంకరాచార్య జీవిత

చరితము మొదలుగాఁగల చరిత్రగ్రంథములును నున్నవి. వీనిలో ముద్రితగ్రంథరాజములు గొన్ని పండితమనః పుండరీకముల రంజింపఁజేయుచునేయున్నవి. అముద్రితగ్రంథావళులింతలో వెలువడి, కోవిదజనకరకమలముల నలంకరింపఁగలవు. ఇట్టివఱకు నేకవియుఁ జరిత్రగాథలను నాటకముగాఁ జేసియుండలేదు గాన నితఁ డాంధ్రచరిత్రనాటక పితామహుఁడనియు, నాంధ్రకవిరాజనియు, బిరుదమును బొందియున్నాఁడు.

—(*) ఇతివృత్తవిమర్శనము. (*)—

ఇందలి కథాశరీరము జగత్ప్రసిద్ధమైన యేకాదశీవ్రత మహిమాంతర్గత మగుటంజేసి ప్రఖ్యాతమనియే చెప్పనగును గాని, సారోద్ధార, బ్రహ్మాండ, పాద్మాది పురాణములయందుండు రుక్మాంగద చరిత్రము నవలోకింప.

విశ్వావసుఁడను గంధర్వుఁడేతెంచి రుక్మాంగదుని యుద్యానవనకాసార సరసీరుహముల నపహరించుటయు, నద్దాని నెఱింగి వనపాలకులేతెంచి, యతనివిమానమును గాల్చి, బాధితునిగాఁ జేసి రాజసన్నిధానమునకుఁ గొంపోవుటయుఁ, బరస్పర సంభాషణానంతరమున రుక్మాంగదుఁడు తన్మహిమ నెఱిఁగి వినయవినమితశిరస్కుఁడై యతని క్షమింపవేఁడుటయుఁ, బిదప గంధర్వుఁడేకాదశీదివసమున నుపవసించిన పారిపుణ్యమును ధారవోసినచోఁ దాదివికేగెదనని చెప్పుటయు, నాడయుఁడు తనభటుల కాజ్ఞాపించి నగరితో జగడమాడి యేకాదశీదివసమునఁ బస్తుపడియుండిన చాఁకిత నొకదానిని భర్తృసమేతముగాఁ బట్టితెప్పించి తేష్ఠుపవాసపుణ్యమును గంధర్వునికి నిప్పింపఁ దన్మహిమచే నతఁడు దివ్యాతపత్రుఁడుం బోలెఁ బైకెగసిపోవుటయు ననునీ మననాటకములోని కథాంశ మచటఁ గాన్పించుటలేదు. అట్లయిన నీయితివృత్తము కల్పితమని చెప్పకతప్పదు. మఱియు సకలకవికులతిలకుఁడగు కాళిదాసమహాకవి శాకుంతలనాటకమున దుష్యంతుఁడను నాయకునికిఁ బ్రాప్త

మైన శతత్వదోషనివారణార్థమై యంగుళీయక దర్శనాదివస్తువును గల్పించి, శృంగార రసపోషణమొనర్చిన వసువున మనకవియు, నేకాదశీవ్రత మహిమాతిశయమును సాధించుటకును, దద్వ్రతాచరణమునందు రుక్మాంగదునికిఁ గలిగిన దృఢతరాభినివేశమునకును, గారణముగఁ బైఁజెప్పిన కథాంశమును గల్పించి, స్వోద్దిష్టశాంతరసపరిపోషణమును నిర్వహించెనని యూహింపవలయు. అదియెట్లంటేని, వ్రతాది సద్ధర్మానుష్ఠానములననేమో! కనివినియైన నెఱుఁగని దుర్జనసంజాత యగు నొకతె, మగనితో జగడమాడి యేకాదశిదినమున నుపవసించిన ఫలమే, గంధర్వునకు రెక్కలఁగలిగించునంతటి మహిమగలదన్నచో! ఇఁక నిరంతర సత్కర్మాచరణపరాయణుఁడును, సత్కులసంభూతుఁడును, యుక్తాయుక్త వివేకవిచక్షణుఁడును, నగుమనుజుఁడు శ్రీహరిపాదపంకజములందుఁ జిత్తమునిడి, హరివాసర వ్రతమాచరించిన నతనిసుకృత మహిమమునకు మేరకలదా! యనువిషయము కైముతికన్యాయసిద్ధమై కేశవవాసరవ్రత మహిమాతిశయమును స్థిరపఱచుచున్నది. రెండవది, మనుజునిఁ గార్యములయందుఁ బ్రవర్తింపఁజేయుటకుఁ గారణభూతములగు ఫలములు దృష్టము, అదృష్టము అని రెండుగలవు, వానిలోనదృష్టఫలము కేవలమాప్తవాక్యముచే విశ్వసింపఁదగినదియై పరోక్షానుభావ్యమైనందునఁ బురుషునికి దృఢాభినివేశమును గలిగింపనేరదు. దృష్టఫలమన్ననో! యటుగాక ప్రత్యక్షప్రమాణ సిద్ధమైనందున స్వసంవేద్యమై యపరోక్షానుభావ్యమగుటచే దృఢతరాభినివేశమును గలిగించును. అనువిషయమును మనకవితల్లజుఁడు చక్కఁగాఁ బరామర్శించి, రుక్మాంగదుఁడు గురుదైవతములయందెంత భక్తిఁగలవాఁడయ్యు, వారలుఁజెప్పిన యేకాదశీవ్రతమహిమను విన్నంతమాత్రముననే యతనికావ్రతమునందంతటి యభినివేశముప్పతిల్లుట, స్వభావవిరుద్ధమని యెంచి, తద్వ్రతమహిమచే విశ్వావసుఁడను గంధర్వుఁడు దివికేగుటయను దృష్టఫలసంగతమును పైఁగథాంశమునుగల్పించి, యద్దానిచే రుక్మాంగదుని

మానసమునందుద్భవించిన భగవద్భక్తి భావనాస్వరూపమైన శమాఖ్య శాంతరసస్థాయిభావంబును నుద్దీపితముగాఁజేసి, స్వసంకల్పిత శాంతరసపరిపోషణమును గడునిపుణముగా నిర్వహించెను. పాఠక మహాశయులారా! నేనుగవికల్పితమని నుడివిన కథాభాగసంగమగు రుక్మాంగదచరిత్రము మఱియేపురాణమునందైన నుండినచో నిచ్చోటనే జేసిన యధికప్రసంగిత్వమును మన్నించెదరుగాక.

—(*) పాత్రౌచిత్యము. (*)—

రుక్మాంగదుఁడు వింధ్యాటవికిఁబోవఁ బ్రయాణమైయుండ నతని పట్టఁపురాణియగు సంధ్యావళి యతనికడకేతెంచి ప్రయాణ కారణమును నొక్కియడుగు సందర్భమున.

“(రుక్మాంగదుడు—నాళీకాననా? నాప్రయాణమునకు నిజమగు కారణంబుఁ దెలిపెద.

చ॥ అతివరో! వింధ్యవాటిఁదనరారు గిరీశునిదేవళమ్మునన్।
రతిసతియో, భుజంగకులరామయొ, నాఁజెలువొందునారి సం।
తతము సతీపతిస్మరణతత్పరయై, యతిచిత్రగాన సం।
గతి భువనైక మోహినిగఁ గ్రాలుచునున్నది చూడఁబోయెదన్॥

క్రొంగనేత్రి—ఆగానయనూన గానసైపుణ్యం బిజ్జగానసెందును గానవని, మానయాస్థాన గాయకశిఖామణి రాగేశ్వరుఁడు సైతము పలికెను,” అనియున్నది.

దీనింబట్టిచూడ, “శ్లో॥ నిశ్చింతోధీరలలితః కలాసక్తస్సుఖీమృదుః” అనులక్షణానుసారముగ మనకథానాయకుఁడగు రుక్మాంగదుఁడు విశారదాది సచివవర్గమునందు రాజ్యభారమునిడి, నిశ్చింతుఁడై యుండుటచే సంగీతాదికళలయందాసక్తియు, నిరుపమానభోగానుభవాపేక్షయు, మొదలగు ధీరలలితనాయక లక్షణములఁగలిగియున్నట్లు

తెలియవచ్చుచున్నది. కాఁబట్టి యీకవిమహాశయుఁడు పాత్రౌచిత్యమును కూడఁ జక్కఁగ వర్ణించినాఁడనుట కేసందియమును లేదు.

—(*) రసవివేకము (*)—

ఈనాటకమునందు శాంతరసమే ప్రధానముగా నుండినను, రుక్మాంగదాశ్రితమగు రత్యాఖ్యస్థాయిభావము, మోహినియను నాయికయొక్క రూపయౌవనలావణ్యాది దర్శనముచేతను, మందమారుతస్పందన, కోకిలాలాప, శ్రవణాదులచేతను, నుద్దీపితమై, పూర్వోక్తకామినీకటాక్ష భ్రూవిక్షేపాదులచే ననుభావితమై, స్తంభ, ప్రళయ, రోమాంచాది సాత్త్వికభావభాసురంబై, తత్కామినీవిషయక సంభోగౌత్సుక్యావేగాదులచే వ్యభిచరితమై, రసరూపముగాఁ బరిణమించిన శృంగారమనునదియు, మోహిని ధర్మాంగదుని శిరమును ద్రుంచుమని చెప్పిన సమయమున రుక్మాంగదుని మానసమునందుద్భవించిన శోకాభిదమగు స్థాయిభావము, ("రుక్మాంగదా? ఆలస్యమేల? వైళమ్మె వాలమ్మున నీబాలునిశిరము తఱుగుము") అనినిర్బంధించు మోహినియొక్క క్రూరవాక్య శ్రవణముచేతను, సుకుమారకుమారాకారవీక్షణముచేతను, నుద్దీపితమై, పుత్రునియొక్క దీనదృష్టి ప్రసరణాదులచే ననుభావితమై, శోకాతిరేకమునఁ గలిగినయశ్రు, వైవర్ణ్య, వైస్వర్యాది సాత్త్వికభావసంగతమై, దైన్య, చింతా, వ్యామోహాదులచే వ్యభిచరితమై, రసరూపముగాఁ బరిణమించిన కరుణమనునదియు, సంగతయాను ప్రవిష్టమ్మై మిక్కిలి చక్కఁగాఁ బరిపోషింపఁబడినవి.

సహృదయులారా! పెక్కుమాటలేటికి? అస్మత్కవికృతములగు నాటకములలోని యాయాభాగములఁ దిలకించినట్లయిన నీకైసతుల మిన్న శృంగారరసాభివృద్ధిఁ జేయు విషయమునందు శ్రీకాళిదాసమహాకవికిని, కరుణరసాభివర్ధన విషయమున శ్రీభవభూతిమహాకవికిని, నేమి తీయువాఁడు కాఁడను తలంపు మీ డెందమునఁ బొడముఁగలదని నాత్రివ్వ శాని నమ్మకము.

—(*) పాకము (*)—

ఇతనికవిత్వమంతయు ద్రాక్షాపాకముగనుండియుఁ, గొందఱు మాత్రము నారికేళపాకమని వచించుచున్నారు. రసజ్ఞానములేనివారలు పాకభేదము నెట్లెఱుఁగఁగలరు? కాఁబట్టి కలయునకీవిషయమునందింతయు కవిశ్రాంతి నొసంగెద.

—(*) గుణము — శయ్య (*)—

సీ॥ ఖేచరత్వముమాని, భూచరత్వముఁబూని,
నీచవృత్తినిఁజిక్కి నేరమనఁగ।
దానవారులఁ గేరి, మానవాళిఁ జేరి,
మాననీయంబని మనుదునెటుల।
వసుధారుడివీడి, చవిలేనికడి వేఁడి,
భువినెటుజీవింతుఁ బోలునను చు॥

అనుసీపద్యమునందలి వాక్యములు వేర్వేఱనమర్పఁబడియుండుటచే మాధుర్యాఖ్యగుణమును బదములొండొంటితో నిక్కలి మైత్రిఁ గలిగి వర్తించుచున్నందున శయ్యయు, నలరారుచున్నవి.

—(*) వృత్తి. (*)—

సీ॥ నిరుపమానవిలాస, నీహారకరహాస,
యాసదృశచాంపేయ కుసుమవాస।
బింబఫలాధర, పీనపయోధర,
కంబుకంధర, కాలకంధదికర।
రాజితరాజ మరాళయాంచితయాన,
రాజీవలోచన, రాజవదన।
అంచితకాంచన చంచలాభముదేహ,
నవకోమల మృణాళవాళబాహ॥

స్వర్ణశోభవర్ణరుచిర, శ్రీవర్ణకర్ణ।
పల్లవకలారుణోరు విస్ఫురణచరణ।
పిప్పలపత్రశాతల వితతజఘనబింబ।
అఖిలలోకైకమోహిని, యౌవనాంగి॥

ఈపద్యము కోమలార్థసందర్భ గర్భితమగుటంజేసి, కైశికీవృత్తికి నుదాహృతంబయ్యె.

—(*) రీతి (*)—

ఉ॥ సోగమెఱుంగు తేజమున సోయగమందిన పూవుఁదీఁగయో।
నాగవెల్గుంగుచుం బురుషనాగకులాంకుశమై చెలంగుచుం।
వాగమృతంబుఁజిలుకఁచును, పారిజపత్రవిశాలలోచనా।
వేగమెరావె మోహిని, నవీనవిలాసవధూవినోదినీ॥

ఇయ్యది నాతిదీర్ఘసమాసోపేతమై, మృదుపద బంధబంధురమై యున్నందున వైదర్భీరీతికి నుదాహరింపఁబడియె.

—(*) ధ్వన్యలంకారములు (*)—

ఉ॥ తమ్ములుపుండరీకములు, దండలుమాలలు, శీతవాతపో।
తమ్ములురుప్రభంజన విధమ్ములు, శాతశిలీముఖమ్ములా।
తుమ్మెదచాలు, చందురుఁడు దోసవుగామయె, తాళనకటా।
నెమ్ములుపోశిఖుల్, భువినినేతలసంగతి లేనినాతికిన్॥

ఇచట విరహిత వనితావస్థను శ్లేషానుప్రాణిత విరోధాభాసాలంకారముచే సహృదయ హృదయంగమమగునట్లు వర్ణించియున్నాఁడు. మఱియు నీయలంకారముచేత విరహులగువారికి నింపు సందర్శన, మంద మారుత స్పర్శదిన, మయూర నినాదాకర్ణనాదులు కామోద్దీపకము లగుటంజేసి, మన్మహాములను వస్తువు ధ్వనితమగుచున్నది.

—(*) కల్పనాచాతుర్యము (*)—

అలశక్తిత్రయవర్ణభావ గరిమంబాశించి, ప్రాగ్జన్మ పూ।
జల ప్రాబల్యముచే నఖమణిశిరోజాతంబు నీలంబయెన్।
ఫలియించెనేమృదులాధరంబరుణమై భాగోన్నపాలోలేక్షణం।
బులుభావల్యేభళింభకౌరుచులపొంపులౌ నింపుజూపట్టుచున్॥

ఇవ్వోడ హేతూత్ప్రేక్షా కల్పనాచాతుర్యముకనఁబడెడి.

—(*) ఆరోపప్రావీణ్యము (*)—

సీ॥ పున్నాగచిత్రాగములను ఛేదింపఁగ,
కంద్రగొడ్డలిగాదె, కలికిపలుకు ।
ఆగమతత్వ విద్యాచంద్రికను గప్పు,
కాలమేఘముగాదె, కాంతకొప్పు ।
ప్రాగ్జన్మకృతపుణ్య ఫలతోరణములై,
పరిణమించును గాదె తరుణికనులు ।
నిశ్చలహృదయాంబు నిధినిఁగదల్చెడు,
మారుతాకృతిగాదె, మగువతెగుత ।

భవ్యతాపసజన ధైర్యపర్వతముల ।
పాలిఃపిధారల తివలభావహావ ।
విభ్రమవిలాస వీక్షణవిభవగతులు ।
కానఁబడయనప్పువదలు మాకాంతయిపుడు ॥

ఈపద్యమెట్టి కామకలాకౌశల్యము గలవానిమనస్సునైనను మరల్పఁజాలినదనుట, యతిశయోక్తికాదు. మఱియు, నిచటిసమస్తవస్తువర్తిసావయవరూపకాలంకారస్వరూపమగు నారోపణము, కడుంగడుఁ బ్రశంసనీయము.

—(*) సంగ్రహనైపుణి (*)—

సీ॥ జలజాతగర్భుని చదువులకునుఁదోడు,
నిర్జరాదులకుఁ బెన్నిధులవీడు ।
సీరధిమునిఁగెడు ధారణికినావ,
త్రిదశారిహృదయ నిస్త్రింశనఖుఁడు ।
చూపకంబులదప్ప మేనఁగొల్పినవాఁడు,
రాజులరక్త తర్పణపరుండు ।
దశశిరోధికి విపద్దశఁగూర్చువైరంబు,
కేవటిదేవికి భావజుండు ॥

అసురకాంతలశీలాగ్నినార్చుఘనుఁడు ।
తురగఖురఘట్టితానేకదురితచయుఁడు ।
పంచతత్త్వావిశిష్ట కృపణవవాసి ।
దాసునిఁగఁబ్రోచుఁ దాసదాథరణినన్ను ॥

కట్టకడకుఁ బదిపద్యములచేనైన, వర్ణింపకతీరని భగవద్దశావతారముల నొక్కపద్యముచే నిచట మిక్కిలిచక్కఁగా వర్ణించి, కవి తనసాటిలేని సంగ్రహనైపుణ్యమును గనఁబఱచియున్నాఁడు.

ఇంతియకాదీగ్రంథమునం దచ్చటచ్చట, సందర్భోచితములై, ముద్దులకుములుకగట్టు లోకోక్తులును, శబ్దాలంకారాదులచే నొప్పారురసవంతములగు పద్యములును, పెరివిగాఁగన్పట్టుచున్నవి. కాని వానినన్నిటిని నిచ్చటఁ బొందుపఱుపవలెనన్న, నేను గార్యాంతరాయత్తమానసుఁడనగుటచేతను, వ్యాసము విస్తారమగునను భీతివల్లను, సాకల్యముగ నిరూపింపక దిఙ్మాత్రప్రదర్శనమొనర్చితిని. మఱియుఁ బ్రాచీననాటకలక్షణముల ననుసరించి, వ్రాసినవారికి వానిని సభ్యుల కపిదురింపకుండుటచేఁ బ్రదర్శనయోగ్యములు కానేరవయెండ్, కవియిచట వానినంతగాఁ బాటింపఁజాలఁడు. సర్వజ్ఞత్వ మొకరిసొమ్ముగాదు గనుక నచటనచటఁ గొన్ని లోపములు గన్పట్టుచుండినను, "గచ్ఛతస్స్ఖలనం క్వాపి" యను నార్యోక్తి ననుసరించి, గుణగ్రహణపారీణులగు పండితులు పురోభాగిత్వము నవలంబింపకుందురుగాత. ఇట్లు భాషాయోషామణి ననూనాలంకారభూషితనుగాఁ జేసి, జగద్విఖ్యాతినిగాంచి, యశశ్శరీరముచే నునికియందు మనకవిముక్తామణి యుత్పత్తికిఁ గారణభూతమగు కోలచలవంశవృషభము నాచంద్రతారార్కముగ వర్ధిల్లుఁగాతమని సర్వేశ్వరునిఁ బ్రార్థించుచు నీవ్యాసమునింతటితో విరమించెద.

ఇట్లు, విన్నవించు సుధీజనవిధేయుఁడు,
రావాడి వెంకటరామశాస్త్రి
తెలుఁగు పండితుఁడు,

శుద్ధాశుద్ధపత్రిక.

పుట.	పంక్తి.	అశుద్ధము	శుద్ధము.
3	17	ప్రారంబించితిమి.	ప్రారంభించితిమి.
,,	19	పుస్తుకము.	పుస్తకము.
,,	22	,,	,,
4	2	,,	,,
5	1	వందనంబులాచిరించి.	వందనంబులాచరించి.
8	15	తపఃకార్శ్యంబులన్	తపఃకార్శ్యంబులన్.
12	2	అలుకుగండ్లను.	అలుకుగలను.
,,	24	విదుపుదు.	విడపుఁడు.
13	16	రయపచారంబొనర్చిన.	యపచారంబొనర్చిన.
14	19	కనుకొని.	కనుఁగొని.
18	14	తత్సహాయంబున.	తత్సాహాయ్యంబున.
19	1	నువవశించి.	నుపవసించి.
,,	15	నిషి.దేశుండు.	నిష.ధేశుండు.
,,	21	సంతానంబులేమి, బెను	సంతానంబులేమిఁ, బెను
21	2	సలువయాజ్ఞబం.	సలుపనాజ్ఞఁబం.
22	1	వారికెల్లరుకుఁ.	వారికెల్లరకుఁ.
24	11	సౌందర్య శ్రీ.	సుందర శ్రీ.
,,	15	పదివినంది.	పదపినంది.
25	17	కూర్చుని.	కూర్చుండి.
,,	23	పోతవారు.	పోఁతవారు.
,,	24	లును.	రును.

పుట.	పంక్తి.	అశుద్ధము.	శుద్ధము.
27	8	కల్పిచెద.	కల్పించెద.
,,	7	నాగ.	నాఁగ.
27	9	వినోదనీ.	వినోదినీ
28	6	చీకటిఁగప్పి.	చీఁకటిఁగప్పి.
29	2	శుభముగుగాత.	శుభముగుఁగాత.
31	14	యనారోగ్యము.	ననారోగ్యము.
,,	17	ప్రాపంచక.	ప్రాపంచిక.
33	24	యంతరేంద్రియు.	యంతరింద్రియు.
34	8	రాషువ.	రాఘువ.
,,	24	యెట్టికేలకు.	యెట్టుకేలకు.
35	8	జానకవి.	జానకివి.
,,	12	జేన్నార.	జెన్నార.
36	16	యోనారద.	ఓనారద.
,,	20	తనదారితానుపోయె.	తనదారిఁదానుబోయె.
37	9	దుర్వాషుండు.	దుర్వాసుండు.
,,	14	గాఁచిన.	గాచిన.
,,	16	యిదియంతయు.	ఇదియంతయు.
40	1	కరిగించు.	కరఁగించు.
41	11	ప్రాంత్యంబుల.	ప్రాంతంబుల.
,,	13	భద్రంబుంతాన.	భద్రంబుతాన.
41	14	మఱుగు.	మఱుఁగు.
42	18	మానసయై.	మానసనై.
43	12	కారణభూతుడగు.	కారణభూతుఁడగు.
46	17	కరుణగనుము	కరుణఁగనుము.
47	14	ఊకలాపికలాప,	ఊకలాపికలాప.
48	28	భూతలంబుజేరి.	భూతలంబుఁజేరి.

పుట.	పంక్తి.	అశుద్ధము.	శుద్ధము.
49	16	యుంటిరి.	యుంటిరి.
51	22	చంద్రికాసమవే.	చంద్రికాసమవేసా.
52	4	ధత్వ.	ద్ధత్వ.
52	12	వాగురులకు.	వాగురలకు.
58	8	మానీనీమణి.	మానినీమణి.
,,	11	భమా.	భ్రమా.
,,	19	వెఁగేలి.	వైఁగేలిడి.
55	3	ఒకరిరువుగారు.	ఒకరిరువురుగారు.
55	5	నాగరికత.	నాగరికత.
,,	23	నీలాలోలతా.	నీలాలోలాలతా.
56	3	నాపుతుఁడును.	నాపుత్రుఁడును.
,,	13	నీవిత.	నీవిరిత.
57	4	మాదివరుకాదులు.	మారివరుకాదులు,
59	23	చెతలు.	చేఁతలు.
60	1	భజనలయ్యె?	భజనలాయె?
,,	8	చెదరించి.	సదిరించి.
61	5	కడికి.	కటికి.
,,	9	దశమి.	దశమి.
64	8	విధ్వంస్తుని.	విద్వస్తుని.
,,	10	వుద్యావృధ్యంతరాయ.	విద్యావృద్ధ్యంతరాయ.
67	10	జపానుపాన.	జపానుష్ఠాన.
70	13	పదతి.	పదఁతి.
,,	20	కారులబడి.	కాటులబడి.
71	25	దూరకు.	కూటకు.
72	13	పుడమిపులు.	పుడమికోఁడులు,
,,	16	కాఠిన్యము.	కాఠిన్యము.

పుట.	పంక్తి.	అశుద్ధము.	శుద్ధము.
,,	18	వాడికరము.	వాఁడికరము.
78	11	యూరువుకి.	యూరుభరికి.
76	1	నేలబడ నేల.	నేలఁబడ నేల.
,,	2	గాడొలఁగుచు.	గాఁడొలఁగుచు.
75	28	కన్నీరుదొరఁగుచు,	కన్నీరుదొలఁగుచు.
76	7	దల్లటు.	దల్లడ.
,,	18	కలఁగుచున్నది.	కరఁగుచున్నది.
77	11	బలసి.	బకసి.
78	10	ఆలశ్యంబు.	ఆలస్యంబు.
,,	19	లడబ.	లడఁబ.
,,	20	కరవారము.	కరవాలము.
,,	28	వాడికరవారము.	వాఁడికరవాలము.
79	14	తలఁగ.	తఱుగ.
81	4	దుస్వ్రి.	దుష్ప్రి.
,,	17	వాగ్రతి.	వాత్రతి.
82	8	మృతికినైదరుఁ.	మృతినైదురుఁ.
88	11	నక్రూటక.	నక్రూటిక.
84	19	మునిరాడ్రతి.	మునిరాత్రుతి.
85	9	శిరముఁదలఁగ.	శిరముఁదఱుఁగ.
,,	16	దుర్గణ.	దుర్గుణ.

శ్రీ

ప్రథమాంకము.

ప్రథమతరంగము.

రుక్మాంగదుఁడు - సర్వోత్తమాచార్లు - నారాయణభట్టాచార్లు.
వనపాలకులు (విదిశాపురోపవనము- దేవాలయము సరస్సు)
రుక్మాంగదుఁడు దేవపూజసలుపుచుండును.

రుక్మాం॥ కం॥ నారాయణ భువనావన।
పారాయణ పరమపురుష పరపారగతా।
వారణరక్షణ దురితని।
వారణచణచరణ నీకు వందనమిదెరా॥

(అనుచు వందనం బిడి.)

దండకము.— శ్రీమద్రమామానినీ మానసాంభోజమిత్రా, మదోన్మత్తదైతేయవంశాటవీవీతిహోత్రా। నిరాఘాటనీరంధ్రజీమూత సంఘాతనీకాశతేజోరుగాత్రా। ధరిత్రీకళత్రా, దయాస్నిగ్ధశోభాయమానోరునేత్రా। గిరీశాజశక్రామరస్తుత్యచారిత్ర। సర్వాఘవల్లీలవిత్రా। పవిత్రా, పునర్జన్మపాథోధినిర్మగ్న దీనావనాయానపాత్రా। సువిజ్ఞానపాత్రా। విహంగేశపత్రా। విమత్తారిజైత్రా। లసద్వల్లవీయావనోద్యానచైత్రా। సుపర్వేశదుర్వార గర్వోగ్రసంభూతజీమూతసంఘాత సంత్రస్తగోధాత్రికత్రాతరూపాంద్రి

తాంగుష్ఠ దేశస్థగాత్రా। యశోదాదయాపుత్ర, నీచిత్రచారిత్రమున్
స్తోత్రమున్ జేయ బ్రహ్మేశ్వరాహీశ దేవాదులున్ జాలరన్నన్
ననున్ బోలు దీనుండెటుల్నేర్చునో తండ్రి, నీదివ్యదేహంబునన్
లీనమైయుండు నీరేడులోకంబులున్ గాదె, గాయత్రి నీపాదరూపం
బుగాదే, మహాదేవ। వారాన్నిధిన్ యోగనిద్రానుసంధాన మో
దంబునన్నీవు నారాయణాకారతన్ దాల్చి రాజింపవేదేవ, మున్మీ
నవై వేదముల్ నాల్గు రక్షింపవే, కూర్మమై కుంభినీధ్రంబు మున్నీటి
లోఁ దేల్పవే, కోలమైకుంభినిన్ గాచి హేమాక్షునిన్ గూల్పవే, నార
సింహాకృతిన్ బూని దైతేయునిన్ గూల్చి ప్రహ్లాదునిన్ నిర్భరాహ్లా
దునిన్ జేయవే, పొట్టివై యాబలిన్ మెట్టవే, జామదగ్న్యుండవై భూమి
పాలాళినిన్ జంపవే, రాముఁడై భీమసంగ్రామమందా మహారావణున్
లోకవిద్రావణున్ ముంపవే, రేవతీకాముఁడై బ్రోవ వేయాదవాళిన్,
భువిన్ బుద్ధుఁడై దేవసంరక్షణాబద్ధుఁడై లోకసంబంధసంబుద్ధిమై
యాసురస్త్రీలకున్ శీలభంగంబుఁ గావింపవే, కల్కివై మష్టులన్ జులక
నన్ జంపవే, దేవదేవా: ననున్ గావవే, శిష్టరక్షావనా, దుష్టశిక్షా
చణా, ఘోరసంసార నీరాకరోత్తారకా, క్రూరనక్తంచరవ్రాతదర్
ర్వ నిర్వాపకా, ధర్మవిస్తారకా, సౌఖ్యసంధాయకా, మోక్షలక్ష్మీ
మనోనాయకా, గానమోదాత్మకా, దీనసంరక్షకా, కుండలీతల్పకా,
భక్తసంకల్పకా, బ్రహ్మరుద్రానిలాదిత్యసంస్తుత్యపాదా, సురేశార్థిత
శ్రీద, మౌనీంద్రహృన్మోద, నీపాదముల్ నమ్మితిన్ బ్రోవుమా మాధ
వా మ్రొక్కెదన్, మ్రొక్కెదన్, మ్రొక్కెదన్.

దేవా- చరాచర ప్రపంచంబున భవద్వ్యతిరిక్తంబగు వస్తువు
లవమాత్రమైనఁ గానరాదుగదా. వేదాంతవేద్యా: తావకపాదారవింద
సంస్మరణంబుగదా దురితనివారణంబై తత్త్వవిజ్ఞాన ఘంటాపథంబున
మునిరాణ్ణికాయంబును కైవల్యోద్యానంబు జేర్చును. యోగిజనవాగ్గే
యా: అమేయంబగు భవన్నామధేయ స్మరణానందరోమాంచితకాయ

విభాసితమునినికాయమును ముక్తిరమాధారేయులఁ జేయఁబూను నీ యప్రమేయ మహిమాతిశయంబు వర్ణింపనలవియా? గదాధరా: నీకథాసుధారసధారాధురీణాయమాన మానసులకు సత్యవిశుద్ధప్రభావ మహిమంబు మహనీయంబుగ సిద్ధించునుగదా. కంసారీ: మాతృగర్భాంధకూపతతులమునిఁగి సంసారావర్తగర్తంబునఁ బరిభ్రమించి రుగ్జరామరణాది దుర్దశలపాలై దరిదాపుఁగానక తిరుగునరులు తావకీననామధ్యానసలిలధౌత మహాకలుషజాలురై ముక్తికామినీ పరిణయానందము నందుదురుగాదే?

సీ॥ సంసారచక్రచంక్రమణార్తనరులకే దేవునిపదసేవ దిటఁపునావ।
భవజరామరణాది బంధ బాధితులకే దేవునామము ముక్తిదేవళమ్ము।
దైతేయకుల పర్వతంబులకే దేవు దర్శనంబగు వజ్రధారసమము
విపులాఘసంకోహ విపినదావంబార్పఁ జాలునావ్వనికీర్తిజాలమహిమ॥

గీ॥ వేదవేదాంగవేదాంతవేద్యుఁడెవఁడు!
మహితమాయాసమావృతమహిముఁడెవఁడు।
ఆదిమధ్యాంతరహితుఁడై యెన్నియగుచు।
నెవఁడువిలసిల్లు వానినే నెంతుమదిని॥

(అనుచు జాఁగిలి మ్రొక్కి కూర్చుని).

ఆచార్యులవారు ఇఁకఁబుష్పార్చనకుఁ బ్రారంభింతము.

సర్వో॥—మహారాజా. కానిమ్ము. (భట్టాచార్లనుఁజూచి) భట్టాచార్యులవారూ; విష్ణుసాహస్రనామావళి పుస్తకముఁదెచ్చినారా?

భట్టాచార్లు.—అయ్యా, మీరుతెచ్చియుందురని నేనుపేక్షించితి.

సర్వోత్తమా.—మీరుతెత్తురని నేఁదే వదలితి.

భట్టా.—అయ్యా, పుస్తకముఁదెచ్చువంతు మీదైయుండ నేనెటుదెత్తునని తలంచితిరి? ఇది జ్ఞానశూన్యత కాదా.

రుక్మాంగద.—ఆచార్యులవారూ! మీరేల కలహించెదరు? ఇదిగో నా పుస్తకమిచ్చెద- పుచ్చుకొనుఁడు.

భట్టాచార్లు.—(అందికొని)- (సహస్రనామావళిఁ బ్రారంభించును) (రుక్మాంగదుఁడు కమలార్చన చేయుచుండును అపుడు రెండు కమలములు తక్కువపడును)

రుక్మాంగదుఁడు—ఏమియద్భుతంబు? పూజకు నిన్నయొకటి, నేఁడు రెండు పూలు తక్కువపడుటకుఁ గారణంబేమియుండును? సాహస్రకమలసారసంబని యెన్నికఁగన్న సరోవరలక్ష్మికి నిటు కుందురానేల? ఇది ఘోరకృత్యంబని నేనమ్మెద.

భట్టాచార్యులు.—భూపాలాగ్రణీ, "పత్రం- పుష్పం- ఫలం- తోయం" అనియున్నది- పుష్పములు లేనిచో జలముతో నర్ఘ్యమిడఁదగును.

సర్వోత్తమా—ఆచార్యులవారు- ఏమిమాటలాడెదరు? నీచోన్నతపదవులనాలోచించికదా మాటలాడవలెను. ఏమియు లేని దరిద్రులకాశ్లోకార్థమన్వయించునుగాని యిట్టి సంపత్సార్వభౌములకు నదియన్వయించునా! సహజకమలములు లేనియెడల సువర్ణకమలములచే శ్రీమన్నారాయణ పాదపూజసలుపనగును.

రుక్మాంగదుఁడు.—ఆచార్యులవారూ- అటులనే సువర్ణకమలములచే సుపర్ణవాహనునిఁబూజించెద.

భట్టాచార్లు.—అటులనే కానిండు, (అనుచు మిగిలిన రెండు నామములుచ్చరించును).

రుక్మాంగదుఁడు.—(పూజించి మంగళహారతిచేసి)

పృథ్వీవృత్తము.

నమామియదునాయకం । నవఘనాభనీలాంగకం
నమామిగరుడధ్వజం । నరమృగేంద్రరూపాత్మకం
నమామిపురుషోత్తమం । నగవిపక్షసంరక్షకం
నమామినరకాంతకం । నతజనాఘనిర్మూలకం॥

(అనుచుఁబునర్వ్యందనంబులాచిరించి విప్రవరులకుఁదాంబూలదక్షిణలిచ్చి)

విప్రవరులారా. తాముగృహంబులకువెళ్ళుఁడు.

విప్రులు—చిత్తము. (విప్రులు నిష్క్రమింతురు).

రుక్మాంగదుఁడు.—ఏవరురా యిచటనుండువనపాలకులు?

వనపాలకులు —మహాప్రభూ వచ్చితిమి.

రుక్మాంగదుఁడు.—ఓరీ నిన్నటిదినంబున నారాయణారాధనకు నొక పుష్పంబు తక్కువపడెను నేఁడు రెండుతక్కువాయెను. కారణం బేమి? ఈవనంబెవరో చోరులుప్రవేశించి కమలములు దొంగలించుచున్న వారనితోఁచెను.

వనపాలకుఁడు.— మహాప్రభూ: కేలుంబనలు కంటికివత్తినిడుకొని కట్టుకావలిగఁ గాపారంబుగాచుచున్నాము. ఇంచుకేవఁడు నడుగిడిన జాడకానరాదు.

రుక్మాంగదుఁడు.—ఓరీ బుద్ధిహీనులారా? చోరులెవరో ప్రవేశింతుర నుటకు సందియంబులేదు ఈరాత్రి వారిజాడనెఱింగిపట్టితేకున్న మిము వధింపనాజ్ఞయొసంగెద వెళ్లుఁడు.

(కావలివారు చిత్తమనుచు వెళ్లుదురు.)

నిష్క్రమము.

ద్వితీయరంగము.

—(o)—

కావలివారు, విశ్వావసుఁడను గంధర్వుఁడు.

—* వీధి. *—

కావలివాఁడు —ఓరీ పంచవదనా? జనులు సంచరించుతలమిది గుంపు నంబడి పీఁడుతప్పించుకొనిపోవును సుమా హెచ్చరిక.

పంచవదన.—నిజము వీని రెట్టలువిఱిచి వీపునఁగట్టి తీసుకొనిపోవుదము.

విశ్వావసుఁడు—అధికారులారా! నన్నేబాధనిడకుఁడి. నేఁదప్పించుకొని పలుగిడునట్టి ద్రోహినికాను. మీరాజానరసకువచ్చెదను. ఇదినా గ్రహచారబలము.

చ:॥ ముదమున నీరసాతలమున్ గనవచ్చితినేల? వచ్చి స
మ్మదమున నీవనంబుగన మానసమందున నెన్న నేల? కా
రదనవసౌరభమ్మిచట రాజిలఁజేసినదేల? యేల నే
హృదయమునన్ దలంచితిని యింపనిదాని గ్రహింప నక్కటా॥

భటవరులారా నేనన్నింటఁజెడితిని-వియత్పదవిఁగోల్పోయి విపదబ్ధిని మునింగితి.

సీ॥ ఖేచరత్వముమాని భూచరత్వముఁబూని నీచవృత్తినిఁజిక్కి నేఁడుఁగ
దానవారులఁగేరి మానవాళినిఁజేరి మానవీయంబని మనుదునెటుల?
నవసుధారుచివీడి చవిలేనికడివేఁడి భువినెటుజీవింతుఁ బోలునదుచు?
కులవిద్యమానుచు ఖలవిద్యనేర్చుచు నిలనుండ మనమెటుగలుగునకట?

గీ॥ పాకశాసన,పావక,పాశి,పవన,
ముఖ్య దిక్పాలవరులకు మ్రొక్కుకరము
లెటుల భూభారమగనేలు కుటిలనృపుల
గాంచిమోడ్చును? కష్టసంకటముగాదె॥

హా! నేనెంతచింతించిన నేమిప్రయోజనము. రానున్నది రాక మానునా!

కావలివారు.—ఏమయా! పెండ్లినడకలునడచెదవు. త్వరగనడవుము.

అనుచుఁబిలిచికొనిపోవుదురు.

నిష్క్రమము.

తృతీయరంగము.

రాజాస్థానము.

రుక్మాంగదుఁడు. విశారదుఁడు (మంత్రి). విశ్వావసుఁడు. వనపాలకులు-

రుక్మాంగదుఁడు—విశారదా! ఇప్పుడు రెండుదినంబులనుండి నామనంబునకించుకైనను హర్షంబులేదయ్యె.

విశారద—మహాప్రభూ? కారణంబేమి?

రుక్మాంగ—ఏమని తెలుపుదును?

చ॥ కమలసహస్రమొక్కొకటిగాను దటాకమునందుఁ దగ్గఁగా
నమరఁగ సంతసంబు హృదయంబునకుం, మురవైరిసేవలో
పముగలుగంగ నివ్వఁడొకొ పాడుక యొక్కొకసారసంబు ని
త్యముగానిపోవుఁ జౌర్యమున నద్భుతమిద్ది యమాత్యపుంగవా!

విశారద—సారసంబులిటు తగ్గు కారణంబున నా- సరసీరుహాక్షుని పవిత్రచరిత్రుక్ష్మాభృత్సహస్రాక్షుని అఘమదగజహర్యక్షుని త్రిభువనరక్షుని పాదసేవకున్యూనత కలిగినది ఏమిసేయుదు.

(కావలివారు- విశ్వావసునిఁబట్టికొనివచ్చి యాస్థానముననిలిపి రాజునకుమ్రొక్కిరి)

కావలివారు—మహాప్రభూ! తమదేవపూజకులోపము మాయాపర సేవకునపాయము గలుగనెంచిన కలుషాత్ముఁడు వీఁడేను. వీఁడింద్రజాలవిద్యానైపుణినిమించి గగనమార్గమున వనమువదిగి వనజంబుల నపహరించుచున్నవాఁడు- వీనికిఁదగిన శిక్షయొసఁగకున్న మముఁబోలుసేవకుల ప్రాణములకు నిత్యగండమైయుండును-

రుక్మాంగదుఁడు—(విశ్వావసునెగాదిగఁజూచి) ఓరీ నీవెవఁడవు? ఏకారణంబున నాయుపవనంబుఁజొచ్చి వారిజంబులనపహరించితివి? నిజముపలికి ప్రాణంబుఁగాపాడికొనుము.

విశ్వావసుఁడు—సార్వభౌమా!

ఉ॥ సర్వజనానురంజనము, సాధునిరూపితతత్వసార, మా
ఖర్వసుపర్వమానససుఖంబగు పర్వము, వాగ్వధూమణీ॥
పూర్వపయోధరామృతము, పూర్వభవార్జితపుణ్యపాకమై
సర్వఫలమ్ము, గానము, శుభమ్ముగుమాకదిజన్మమూలమై॥

భూమిపాలా- నేనుగంధర్వుఁడను భూలోకావలోకనోత్సకుఁడనై దివ్యవిమాన సాహాయ్యమునభువికిఁ దిగితిని- ఇచటమఱియమరు దుచ్ఛలిత పద్మిసీతటంబు గాంచితి- తత్సరసీసరోజాత సారసౌరభాతిశయమునకు ముదితహృదయుఁడనైతి- తత్పరిగ్రహణంబుఁగోరి యొకపుష్పంబు చౌర్యంబునఁగొని పోవయత్నించుచుండ నీభటులు నను బట్టి దివ్యవిమానంబు గాల్చి ననునీసరసకునీడ్చికొనివచ్చిరి, ఇది యనావృత్తాంతంబు-

రుక్మాంగదుఁడు—(దిగ్గునసింహాసనంబుదిగి వ్యసనమభినయించి) హా నేనెంతపాతకిని-

మ॥ క్రతుకర్మంబులు, కాననాంతరతపోకార్యంబులున్, నిష్ఠురా
తతతీవ్రవ్రతదేవతార్చనలు, భూదైవోత్తమారాధనల్,
సతతంబేరికిఁదృప్తిగాను సలుపన్ లక్ష్యంబుగానెంతురా
క్రతుభుగ్వంశజుఁడైన యీఘనునకున్ గష్టంబులన్ బెట్టితిన్ ॥

(నిట్టూర్పులువిడుచుచు) అకటా! అవిద్యాజనితములగు నరిషడ్వర్గమునకున్ లోఁబడి భవజరామరణములకున్ జిక్కి తమ్ముతామెఱుంగని శరీరధారులే మహాపురుషచరణారాధనచే దురితార్ణవతారణుని సృష్టికారణుని శ్రీమన్నారాయణుని శ్రేయఃపదప్రాప్తిఁ గోరుదురో యట్టిమహానుభావులే కట్టెదుటసాక్షాత్కరింపనట్టి వారిని శిరసావహించిపూజించి వారియాశీర్వచనంబులందక వారిన్ గట్టి కొట్టి కష్టములన్ బెట్టిన ననుబోలు మూఢఃనిజన్మంబు వ్యర్థంబు.

అయ్యో! ఏమహామహుల,యేదివ్యపురుషుల,కరుణాకటాక్షవీక్షణం, బులందగాగోరి వారితృప్తికై నిత్యకర్మానుష్ఠానపరులై పంచమహాయజ్ఞంబులు గావించి, యజ్ఞ, వాజపేయ పౌండరీకాది సవనంబులు సేయుదుగో యట్టి దేవులు మహానుభావులు దుర్జనదుర్దర్శనీయులు, తామై దర్శనంబిచ్చియుండ నట్టివారినిఁ దిరస్కరించి పరిభవించి బంధించియుంచిన నేనెంతటి ఘోరకలుషాత్ముఁడనో తెలియదు! నేనేమి సేయుదు? ఈ మరితంబు నెటులీఁగుదు! (విశ్వావసునింజూచి) మహానుభావా- నాతప్పు సైరింపుము- నను దండింపుము- నాశరీరము నీయధీనము.

విశ్వావసు--సార్వభౌమా, నీయందేమంతును లేదు, నీభటులొనర్చినతప్పు నీయది కాదు, ఇంతకు నీభటులు తామైయొనరించినవారు కారు సేవకులైనవారు స్వామికార్యముల జాగరూకతఁగలిగియుంట సహజము

రుక్మాంగదుఁడు—గంధర్వోత్తమా! అటులఁ దలఁచితి రేని నాప్రణామంబులుగొని నన్నాశీర్వదించి పోయెదరని వేఁడెద.

విశ్వా॥—నృపాలా- నేఁబోవు టెటుల! నాదివ్యవిమానంబులుఁగాల్చిరి.

రుక్మా"--(హాయని వెసనమభినయించుచు) మహానుభావా! ఏమి సేయుదు ఈవిషయంబున నాకేమియుఁదోఁపదు.

విశ్వావ॥—భూమిపాలా! ఇందులకు నాకొకసమపాయంబు దోఁచుచున్నయది. ఈపురంబున నేమానవుఁడైనను మొన్న రాత్రిఫలాహారంబుఁగొని నిన్నంతయు నుపవాసంబునఁ దపించి నేఁడుపాత్రికాలంబున నాహారంబుఁగొనియుండినచో నట్టివాఁడు తనచే నార్జింపఁబడిన యాత్రిదినపుణ్యఫలంబు నాకు ధారవోసెనేని దత్పుణ్యఫలంబున నే నవికేగ శక్తుఁడనగుదు.

రుక్మాంగ—(అచ్చెరువంది) (మంత్రినిఁజూచి) విశారదా! అట్టివాఁడు మనపురియందెవ్వఁడైనదొరకునా!

విశారదుఁడు—సార్వభౌమా! విచారించెద (భటులనుజూచి) భటులారా; ఈదివ్యపురుషునిచే నుడువంబడినట్టి మానవుఁడెవఁడయిననుండినఁ బిలిచికొనిరండు. చక్కఁగానరయుఁడు.

రుక్మాం॥—(విశ్వావసుఁజూచి) మహానుభావా? అట్టిమానవుఁడు దొరకునంతవఱకు మీసేవకుఁడొనరించు సపర్యలనందుచు నాగృహంబున సుఖంబుగనుందురని ప్రార్థించెద.

విశ్వా॥—నృపాలా? నీయిష్టానుసారంబుగానిమ్ము.

రుక్మాం॥—అటులైనరండు.

నిష్క్రమము.

తురీయరంగము.

చాకలమర్తి, దుర్గఁడు, మారమ్మ, భటులు.

దుర్గఁడు—ఏమే ఈపాడుగుడిలో నేల కూడులేక పడితివే? నీకై వెదకి వేసరితి. ఒక మాట యాడినందుకింతకోపమేలనే? నీవిటులైన సంసారమెటులగును? రమ్ము బసకువెళ్లుదము.

దుర్గి—పో-పో- ఇప్పటకేలవచ్చితివి? సంసారముచేయను ఆముసలి ముండ నీతల్లియున్నదిమే.

దుర్గఁడు—అయ్యో: ఆమూడుకాళ్లముసలి యేమిచేయును! నిన్న మనగాడిద రంగఁడు తప్పించుకొనిపోయియుండెను- దానిని వెదకుటకుఁబోయి ముండ్లకంపలోఁబడి కష్టపడినది.

దుర్గి—ఆముండకటులనే కావలెను.

దుర్గఁడు—ఆమెయేమిచేయును నీకుమంచిది చెప్పును.

దుర్గి—ఆమెమంచులు నేవినిన సంసారమిదివఱకే పాడైపోవుచుండెను.

దుర్గఁడు—ఏమే యిటువంటిమాటలాడెదవు? సంసారము పాడుచేయుటకేనా చేతనున్న కాసంతయునిచ్చి నాకుఁబెండ్లి చేసినది?

దుర్గి—పెండ్లిచేసినదో-పిడుగు చేసినదో నాకుఁదెలియదు. ఎటులయిన పిల్లలనుగనుమని నన్ను బాధించుచున్నది. కాలాచేతా మొత్తుచున్నది

దుర్గఁడు—చూడవే మాయమ్మకు సంసారముపై నెంతయాశ- పిల్లలనుగని యిల్లుపెంపమని పలికినది. అందులోఁదప్పేమి?

దుర్గి—ఆమెదేమితప్పులేదు. నిన్నుకట్టుకొన్నది నాదితప్పు.

దుర్గఁడు—ఎవరిదయినను దప్పుగాని రమ్ము- ఇంటికిఁబోదము. రంగయ శెట్టిగారింటిలో పెండిలియఁట. బట్టలకుఁదొందర పెట్టుచున్నారు.

దుర్గి—ఎవరయినను తొందరపెట్టనీ. ఆముండ బ్రదికి యింటిలోనుండు వఱకు నేఁగాలిడను- వేఱేయిల్లుచూచి కాపురముండు నెడల వచ్చెదను లేకున్న యీదేవుఁడే మగఁడని యిచటనే పడిచచ్చెదను.

దుర్గఁడు—వలదే నామాటవిను- పెండ్లికిఁజేసినయప్పు తెంచినపిమ్మట వేఱే యిల్లుచేసెదను రెండుదినములెటులైన సైఁచికొనియుండుము.

దుర్గి—ఆరెండుదినము లీగుడిలోనేయుండెద.

(మారమ్మప్రవేశము.)

మారమ్మ—(ఎగాదిగఁజూచి) ముసలిముండనుగుడిసెలో దిగఁద్రొక్కి గుడిలోఁ బెండ్లాముతో ముచ్చటలాడవచ్చితివా? పరాయిది యింటిదాయెను- ఇంటితల్లి వేఱాయెను- పాపికాలము. ఓసీ చండాలుఁడా; ఇచటికేలవచ్చితివి? దాని మోముఁజూడక యొకగడియమైన నిలువఁజాలవా? దాని కాళ్ళమీఁదఁబడి తలపైనెక్కించుకొని యూరేగింపులు చేసికొమ్ము.

దుర్గి—(కోపమునలేచి) ముసలిముండా! యిట్టిమాటలాడి ఆలుమగం డ్లకు వేఱ్పాటుచేయనున్నావా? నీవునాయత్తవుకావు నాపాలిమృత్యువవు నాపాలిమృత్యువవు. కావుననే నీవున్నచోట నేనుండను- నాకువిషమైన నిచ్చి చంపెదవు.

మారమ్మ—(కోపమున)ముండా- విషమిచ్చి కోడలిని జంపుటకు నే నీతల్లి వంటిదాననుగాను. బహుదార్మికురాలను.

దుర్గి—నీ దరుమము పిల్లలనుకనుమని నాకుఁజెప్పినపుడే తెలిసెను. మా యమ్మ కులములోఁబుట్టిన పిల్లకైననట్టిబుద్ధి రాదు. మాయింటఁబుట్టిన గాడిదకైనను చెడ్డబుద్ధి రాదు. నీవు చెడ్డకాన్పులు గనినదానవనికదా నీతో సంబంధము చేయను నాయింటివారను మానవడిరి. నీది నీవు తెలుసుకొని మాటలాడుము. హెచ్చరిక.

మారమ్మ—గాడిదముండా; నానడతనెంచెదవా? నీతలవెండ్రుకలు కత్తిరించెద- హెచ్చరికలంజా (అనుచుమర్గినీఁదన్నబోవును)

(భటుఁడుప్రవేశము)

భటుడు—మీరెవరిచటనింతగత్తెరచేయుచున్నారు?

దుర్గఁడు—(భయపడి) అయ్యా, మేముచాకలివాండ్లము (దుర్గినిఁజూపి) ఇదినాభార్య, (మారమ్మనుజూపి) ఇదినాతల్లి- అత్తకోడండ్రు మొన్న సాయంకాలము తగవులాడిరి. ఇదియిల్లువిడిచి గుడిచేరినది, నిన్నం తయుఁగటిక యుపవాసము చేసినది. ఇపుడించుకరొట్టెముక్క కొఱికి నది. ఇంటికిరమ్మంటే రాదు మరల మాయమ్మతోఁ గొట్లాడుచున్నది

భటులు...(ఒకరిమొగమొకరుచూచి సంతోషమభినయించుచు) మీరం దఱు మారాజువద్దకురావలెను- రాజుగారు దీనిని విచారింతురు.

దుర్గఁడు—అయ్యా మారాజులాగా గద్దలముచేయక యింటికిఁబో దుము. దయచేసివిడువుడు.

మారి—అయ్యలారా: మీబట్టలు నెల యూరకయుదికెదము. మత్తునిను వుఁడు. ఈముండనుండి మాకిన్ని కష్టములువచ్చెను.

దుర్గి—అయ్యా, ఈముసలిముండ యింతచేసినది. దానిఁగొనిపోయి కొఱతవేయుఁడు.

మారి—వయసుముండా: వయసుముండను నిన్నువదలి ముసలిదానిని నన్నేలపట్టుకొనిపోదురు.

భటులు—మీరందఱు రాజువద్దకురండు. రాజు మీయుదంతము విచారించును (అనుచుఁబట్టుకొనిపోదురు)

నిష్క్రమణము.

---

* పంచమరంగము. *

రుక్మాంగదుఁడు, విశ్వావసుఁడు, విశారదుఁడు, భటులు, బాకలివాండ్లు. నాతముఁడు,

ఆస్థానము,

రుక్మాంగదుఁడు—సచివవర్యా: ఈఘనునిచే నుడువంబడినట్టి మానవుఁడొకఁడైనను మనపట్టణంబున దొరకఁడయ్యెఁగాఁబోలు. పదకంబోయిన మనభటులు వేళయయినను రాకయున్నవారు. అయ్యో: ఈమహామహునకెంత యపచారంబొనర్చినవారమైతిమి.

విశారదుఁడు—మహాప్రభూ: తామొనర్చిన యపచారంబించుకయును లేదు. తెలియక మీసేవకులుచేసిన కర్మఫలంబు మిముఁజెందదు. అటుచెందినను మీపశ్చాత్తాపము తత్ఫలంబు బహువయింపును.

విశ్వావసుఁడు — నృపాలా సవుధింతిల్లకు. ఇం దేతప్పును లేదు. నీసేవకులు తమకువిధించినపనిని నెరవేర్చినారు.

> చ॥ తమకువిధించినట్టిపని ధర్మముసేయుటసేవకాళికిన్.
> క్రమమిదియంచుఁజేసి, మతిఁగర్జమూఁగాదిదిచేయనంచుఁగా
> ర్యమునఁదలంచు భృత్యుఁడు ధరాతలమందున నింద్యుఁడౌఁగదా?
> యమునానయట్టివానికి నిహంబున మేలును మీఁదు ముక్తియున్॥

రుక్మాంగదుఁడు—గంధర్వోత్తమా, కావుననే యిప్పని సేవకునియందు ధర్మముస్థాపించును. భూపతియందు భూరిపాతకముస్థాపించును.

విశ్వావసుఁడు—నృపాలా: చోరులనుబట్టి శిక్షించుట రాజులకుధర్మమేగదా: ఇఁకనీతప్పిందేమున్నది?

(ప్రవేశము, భటులు, చాకలివాండ్లు)

భటుఁడొకఁడు— రుక్మాంగదభూపాలా; దండము. ఈపట్టణమంతయు జలగడిగినను తమచేనుదువంబడినట్టి వాఁడెవఁడును దొరకఁడాయె. ఎవనినడిగినను మూఁడుమారులు భుజించి మఱియొకతూరి భుజించుటకు సిద్ధపడియుండినట్టివారుగాని కటికయుపవాసంబు చేసినవారొకరును లేరు. ఈచాకలి దుర్గి, అత్తతోను మగనితోను మొన్నరాత్రి కొట్లాడి పస్తుగ మనయూరివెలుపటి దేవాలయములో దేవుఁడాయని పడియుండినదఁట, నిన్నంతయు నుపవాసంబున నున్నది నేఁడుదయమున యీదుర్గఁడు కనుకొని ప్రాణమునిలుపుటకై రొట్టెముకలయిచ్చెనఁట. దానినిఁగొఱికిసేరుఁద్రావినదఁట.

విశారదుఁడు—దుర్గా: ఇదినిజమేనా?

దుర్గఁడు—దేవరా. నిజము. నాదితప్పు. ఇపుడు నన్నుమన్నించితిరేని ముందునేనెన్నఁడు దానినిదన్నను.

మారమ్మ—అయ్యా: పేదలము, ముసలిముండను. నేను తెలిసీ తెలియక యొకమాటయంటిని. ఇప్పటికోడండ్రు యింటికిఆగాత్యకోరులని నాకుఁ దెలియదాయెను- అటు తెలిసియుండినఁ గోడ లింటికివచ్చిన దినమే విషముతీసుకొని చచ్చుచుంటిని.

దుర్గి—స్వామీ: నేనీయింటిలో కాలుంచినదినమునుండి యీమారమ్మ నాయత్త, నాపాలిటిమారమ్మయై నన్ను బాధించుచున్నది. ఎటులనైన పైనపైన పిల్లలను కనుమంటున్నది.

విశారదుఁడు—అమ్మా- మీయింటికొట్లాటతీర్పును నిన్నచటికి రప్పింప లేమ- ఈభటులునుడివినరీతి నీవుమున్నటిరాత్రినుండి యుపవాసము చేసినది నిజమేనా?

దుర్గి—సామీ- నిజము- నిజము- తప్పాయెను. ముందటు చేయను.

రుక్మా॥—ఏమమ్మా: నీవు నిన్నటిదినంబునఁ జేసిన యుపవాసఫలంబు నిచ్చెదవా? నీవుకోరినంతధనంబిచ్చెద.

దుర్గి—(వెనుకముందుజూచి) స్వామీ: నావద్ద నేఫలమును లేదే? నేనేమి యమ్ముదును?

రుక్మా॥—ఆఫలము నీకగపడునది కాదు.

దుర్గి—సామీ: నాకగపడని ఫలంబు నేనెటులమ్ముదును?

రుక్మా—అమ్మా: నీవిచ్చుటకు సమ్మతించినఁజాలు. చేతినుండి యెత్తియివ్వ నక్కర లేదు.

దుర్గి—సామీ: అటులనైన మనసార నేసమ్మతించినాను.

రుక్మా॥—(విశ్వావసుంజూచి) మహానుభావా: ఈస్త్రీపుణ్యంబునుఁ గొని నన్నాశీర్వదింపనగును.

విశ్వావసు—(లేచి) మంచిది- (అనుచుదుర్గివద్దకుఁబోవును. దుర్గి భీతిల్లి దూరముపోవును)

దుర్గి—అయ్యా: నేఁజాకలిని. నాపరసకురాదు.

మారమ్మ — దుర్గీ- అటులనకు. అతఁడు దేవుఁడు.

దుర్గి—దేవుఁడుగానీ దయ్యముగానీ మొగవాఁడు కాఁడా? మగఁడుకాని మగవానివద్ద నే నెటునిలుతును? నీకుఁగల యలవాటు నాకు లేదు.

రుక్మా॥— అమ్మా- నీవొనరించినపుణ్యంబీ మహానుభావునకిచ్చితినని నీవతని చేతిలో విడువుము.

(భటులునీటిచెంబునిత్తురు)

దుర్గి—(చెంబందుకొని) "నా పుణ్యమునీకు రాని" యని గంధర్వుని చేతిలో నీళ్లుపోయును.

రుక్మా॥—భటులారా- ఈచాకలికోరినంత ధనమిచ్చులాగున భాండాగారాధిపతికిఁ దెలుపుము.

మారమ్మ—మనిసి మోయునంతనా? నాగాడిదరంగఁడు మోయునంతనా?

రుక్మా॥—ఎంతయయినను దీసుకొనిపొండి.

దుర్గి—(అత్తమఁజూచి) ఆదినాసామ్ము నీవేలమాటలాడెదవు? అందులో నీకొకకాసైన నేనివ్వను.

మారమ్మ... నేనేమి- నీవేమి- ఇద్దఱునొకటే కదా? ఏమోకోపమువచ్చినవు గొకమాట పెద్దదాననని యంటే దానినిమనసులోఁ బెట్టుకొంటారా?

దుర్గి—అవును- నీవుమళ్ళివి- దుడ్డువచ్చునని మంచిమాటలాడెదవు.

(అనుచు నిష్క్రమింతురు)

విశ్వావసుఁడు—నృపాలా- ఈచాకలినిష్కటినంబునఁ జేసిన యుపవాస ఫలంబు నాయందంకురించి నాభుజములకు తెక్కె-ఁగట్టినట్టయినది ఇఁక నేఁబోయివచ్చెద.

రుక్మా॥—గంధర్వోత్తమా- వందనంబిడెద (నమస్కరించును)

విశ్వావసుఁడు—

చం॥ సకలకళాకలాపములు చాతురిరంబుగ నీవు పొందుచున్
ప్రకటమహోజ్జ్వలుండవయి శాశ్వతుఁడవై ప్రబలారిసామజ
ప్రకరమృగేంద్రభీకరతఁ జాలిభవమ్ముందుచుఁ బుణ్యలోకపా
లకనుతమై శుభోన్నతి నిలాతలమెల్ల జయించి యేలుమా।

(అనుచు నాశీర్వదించి నిష్క్రమించును)

రుక్మాంగదుఁడు—(విశారదనుఁ జూచి) విశారదా- ఇది యేమియద్భుతము! సకలదైవోపాసన లాచరించినను మాపురియందుండు చాకలి చేసి నంత పుణ్యము నే పొందనైతినిఁ గదా.

విశారద—సార్వభౌమా! నిన్న నేకాదశి కదా. ఆదినమున నుపవాసం బుచేసిన నపరిమితపుణ్యంబు గలుగునని నాకుఁ దోఁచెడు.

(నారదముని ప్రవేశము)

(అందఱు గ్రక్కున లేచి సాష్టాంగదండప్రణామంబు లాచరింతురు)

రుక్మాంగ ఉ॥ నీరజగర్భపుత్రకను! నీకునమస్కృతి, జ్ఞానరత్నరో
దార! భవత్పదంబులకు దండము, మౌనిజనాభివంద్య! లో
కేశ, కృపాసుధాంబునిధి! యంజలి, దేవమునీశ్వరా! నమ
స్కారము, నారదా! దయవిశారద! యుర్విఁ గాపుమా నను౯!

నార॥ మ॥ నృపకంఠీరవ! నీకు సేమమె? భవానీజానిసంసేవ ని
ష్కపటాంతఃకరణంబునన్ సలుపుదే? సంరక్షణాగాధసా
నిపుణత్వంబున మించుదే? యవనినిన్ నీతిన్ బ్రపాలింతువే?
రిపుభూమీశధరాధరావళిభిదారీ! భద్రమే సర్వమున్?

రుక్మాంగదుఁడు—మునివర్యా- భవదీయాశీర్వాద ఫలంబున మాకేమియుఁ గొఱంత లేదు. క్షేమమునను దినవారము, మహానుభావా- మీకింక నుండ కంసారిసేవాపరతంత్రులై హరిని దరితకుం దాలహరిని

నరవిందసహస్రంబుల నర్పించుచుంటఁ దమకుఁ దెలిసిన యుదంతము గదా. సారసాకరమునఁ దప్పక సారససహస్రం బెల్లకాలంబున నుంట సర్వులెఱింగినవిషయము. అట్టికొలనులోఁ గమలములో కటి రెండు తగ్గుచుండెను. తత్కారణంబుఁ గనిపెట్టఁగావలివారి కాజ్ఞయొసంగితి. విశ్వావసుండను గంధర్వపతి రాత్రిసమయమున వచ్చి శతపత్రమ్ములలో నొక్కటి తీయుచుండ మత్సేవకులా ఘనుని విమానంబుఁ గాల్చి యతనిఁ బట్టి తెచ్చిరి. ఆమహానుభావుని యుదంతంబువిని యతనిఁ బూజించి పంప యత్నించితి. విమానహీనుఁడై నాఁకోప నలవికాదని నుడివెను. అందులకై నేను జింతించుచుండ నాగంధర్వపతి నిన్నటిదినంబునం దుపవాసంబుననున్న మానవుని పుణ్యంబుఁ దనకునివ్వఁబడెనేని దత్పుణ్యబలంబునఁ దా దివికిఁబోనగునని పలికెను. అట్టిమానవుఁడు పురియందెవ్వఁడైన నున్నవాఁడాయని వెదకింప నొకచాకలిదొరికెను. ఆచాకలి తనయుపవాసఫలం బాగంధర్వపతికి నివేదింప నతఁడు తత్సహాయంబున దివికేగెను. ఇదియద్భుతావహమైనది. చాకలి పుణ్యంబు నాకులేదాయెఁగదా యని చింతించెద. మునివర్యా- ఈమహిమయేమియుండును?

నారదులు—సార్వభౌమా: హరివాసరఫలంబిది. ఆహరిదినోపవాసంబు దేవానీకమునోవికాసంబు. భక్తజననిశ్రేయసంబు. ఆ- హరివ్రతరహస్యంబు వరాహపురాణభూషణంబై భాసిల్లుచున్నయది.

రుక్మాంగ—నారదా- బ్రహ్మవిద్యావిశారదా- విమలజ్ఞానవిద్యప్రమోదా- నివారితాఖిలభవఖేదా- మీదివ్యపాదంబులఁబట్టి వేఁడికొనియెద. ఈహరివాసరవ్రతంబు మున్నెవరిచే నాచరింపఁబడియె? ఆవ్రతవిధానం బెద్ది!

నారదుఁడు—సార్వభౌమా- ఈవ్రతమహిమం బతివిచిత్రంబు, మున్ను పూర్వ సర్వంసహాకాంత ప్రళయసాగరమగ్నయై మార్గశీర్ష శుద్ధ

యేకాదశీదినంబున నుపవసించి యీవ్రతంబు సలిపినకారణంబునఁ
గదా శ్రీహరిచేనుద్ధరింపఁబడెను. పుష్య శుద్ధ మందియేకాదశీవ్ర
తంబనుష్ఠించికదా మున్నింద్రుండుగోల్పోయిన తనవైభవంబు
సముద్రమథనకారణంబున నార్జించెను. నృపాలా- వీరసేనుఁడను
మహారాజు సంవర్తసంయమీశ్వరకుమారుల నేపురఁజంపిన విప్ర
వధపాతకంబు మాఘ శుద్ధ మందీవ్రతంబు సలిపికదా. తొలఁ
గించికొనెను. సార్వభౌమా- కింపురుషవర్షంబునఁ భాగశన్యత్ఘమా
పాలకుండు విరోధివర్గంబుచేత రాజ్యంబుఁగోలుపోయి వసిష్ఠముని
బోధితుఁడై ఫాల్గుణ శుద్ధ మందీవ్రతంబాచరించికదా మత్తారాతి
రాజన్యకంధరముల సంగరసీమలోనఁ ద్రుంచి శాంతస్వాంతుఁడై విల
సిల్లెను. చక్రవర్తీ- పూర్వకాలంబున హర్యశ్వమహారాజు పుత్రా
ర్థము నరణ్యమున ఘోరతపంబుసలుప శ్రీహరిసాక్షాత్కరించి చైత్ర
శుద్ధ మందీవ్రతంబుసలుపుమని బోధింప నాహర్యశ్వుఁడే మహావ్ర
తంబుసలిపి యుగాశ్వుఁడను చక్రవర్తినిఁగనియెను పూర్వంబు
నిషిదేశుండు, పుత్రపత్యవాంఛచే ఘోరతపముఁజేయ యాజ్ఞవ
ల్క్య మహాయోగివచ్చి వైశాఖ శుద్ధ మందీహరివాసర వ్రతమాచ
రింపుమనిబోధింప నతఁడీవ్రతంబుసలిపి నిర్గళితఖలుని బలవదరివీరవన
దవానలుని నలునిఁ గనియెనుగదా. మహీపాలా- దశరథభూవిభుఁ
డీవ్రతంబు జ్యేష్ఠ శుద్ధ మందాచరించి సజ్జనరక్షాధీనుల, దుష్టదానవశి
క్షాసంధానుల, సూనులఁగాంచి ప్రమోదమొందెను. సార్వభౌమా!
మున్ను వసుదేవుండు వంశవర్ధన సంతానంబులేమి, పెక్కువ్రత
ములు సలుపుచు నుద్భ్రమితుండయి యాషాఢ శుద్ధ మందీవ్రతంబు
సలిపి తాపసమానసోద్యానవర్తిష్ణుని, దానవజీవన ధననిరాకరి
ష్ణుని, రమాకుచమండల సంచరిష్ణుని, కృష్ణునిఁగని నిర్భరానందపరవ
శుండయ్యెను. అవనిపాలా! శ్రావణ శుద్ధ మందీవ్రతంబాచరించి
నృగుమహీపాలుఁడు సామ్రాజ్యరమావైభవంబునందె. రాజోత్తమా! రాజే

రాజు మున్ను తనరాజ్యంబుఁగోల్పోయి గంధమాదనమున సంచరించుచు నరమునీశ్వరబోధితుఁడై భాద్రపద శుద్ధ మందీవ్రతంబు సలిపి పరమప్రమోదమున రాజ్యవిభవంబును ముక్తికన్యకాలలామపరిణయానందంబునుఁగాంచెను. భూపాలా! భద్రాశ్వవర్షంబున భద్రాశ్వుఁడనురాజు తనపూర్వజన్మంబున శూద్రుఁడై తనయేలిక యాశ్వయుజశుద్ధ మందీవ్రతంబుసలుప దానినాలోకించినఫలముచే ముక్తివరారోహను వరియించి పునర్జన్మంబున రాజ్యరమాపఘూటికివరుఁడై కార్తిక శుద్ధ మందావ్రతంబుసలిపి నిరపాయసాయుజ్యపదంబందె. సార్వభౌమా! హరివాసరఫలంబిట్టిది. ఈవ్రతము రోగభవభయాపహ్రితి లవిత్రము. రమాలలనాకళత్ర శోభనచారిత్రము. త్రిజగత్పవిత్రము. దివ్యనుతిపాత్రము. ఇట్టివ్రతదీక్షఁబూని ఫలాహారవృత్తిని దశమీ రాత్రియుండి నిరాహారవృత్తిని నేకాదశిదినంబెల్ల నుపోషితుండై సపుష్పతోయంబుల నారాయణునకు నర్ఘ్యంబిచ్చి పూజించి హరిభజనాతత్పరుఁడై ద్వాదశీదినంబున బ్రాహ్మణోత్తములకుఁ బాయసాదిబహువిధభోజనాదులఁ బారణఁజేయించి తాభుజించి పగలెల్ల హరికథాశ్రవణానందత నుండు మనుజునకు ముక్తికర తలామలకంబుగనుండును. రుక్మాంగదా! ఈహరివాసరవ్రతంబీవాచరించి శాశ్వతసుఖంబందుము. నేఁబోయివచ్చెద.

రుక్మాంగ॥ ఉ॥ చేసెదవందనంబు సరసీరుహగర్భకుమార! నే, నిరా
యాసముగాను శ్రీహరిపదాంబుజమందను మార్గమయ్యె శ్రీ
వాసునివాసరవ్రతము వాసిగఁజేయఁగనెన్నఁడేని, నే
జేసరఁ దద్వ్రతంబునుభువిన్ బ్రజలెల్లనుసల్పఁజూచెదన్॥

నారదుఁడు — సార్వభౌమా! క్షేమముగనుండుము. నేఁబోయివచ్చెద.

(నిష్క్రమము).

రుక్మాంగదుఁడు—(విశారదమనిఁజూచి) విశారదా! ఈహరివాసరవ్రత మహిమవింటివిగదా! మనదేశమెల్లెడ నీవ్రతంబునలుప యాజ్ఞాపింపుము. ఎవరేనిఁదప్పిరేని వారికిఁగఠినదండనయని చాటింపుము.

విశారదుఁడు—మహాప్రభూ- చిత్తము.

(నిష్క్రమణము).

ద్వితీయాంకము.

ప్రథమరంగము

యమదూతలు, చండ, ప్రచండ, ఉద్దండ.

" పినువీథి "

చండ—ఓరీ ప్రచండోద్దండులారా! నాకేమియుఁబనితోఁపకయున్నది ఏమిచేయుదును?

ప్రచండ—హాయిగ నిద్రబొమ్ము. మితిమీఱి తిండితినుము.

ఉద్దండ—ప్రచండా! ఏమిమాటలాడెదవు. ఎల్లకాలంబు పనిఁజేయునలవాటుఁగలవారికి నూరకుంటచేటుగదా- పనిచేయువారికి నిదుర పట్టునా?

చండ—నిజము- ఉద్దండా- నిజముపలికితివి! పనిలేక తిండిరుచించునా!

ప్రచండ—నాకుఁబనిలేనిది బాగుగనేయున్నదిగాని, నిన్న యావిష్ణుదూత నాచెంపకుఁగొట్టినదెబ్బనొప్పిబలమయినది. నలుగురిలో నాకది యవమానకరముగనున్నది.

ఉద్దండ—అవమానమేల! ఆచెంపపెట్టు నీలోకనికిమాత్రమయియుండినన దియవమానమని చెప్పనగు. యమకింకరులని పేరుపెట్టుకొనిన

వారి కెల్లరకుఁ జెంపపెట్టులగుర్తులు కాలిపై వాఁతగనుండ నవ్వ మావమెుదటనుండి వచ్చునా!

చండ—మీకందఱికి దెబ్బలయినవి. ఎప్పుడేగాని యమవిష్ణుదూతలు నన్నంటిరా!

ప్రచండ—నిజము- అదుదానిం బలెఁ బిరికివై నారాయణ నామస్మరణ చేయుచు వారి పాదములమీద సిగ్గువీడిపడితివి. అట్టిపని మానుండి యగునా!

చండ—ఆ పని మీ చేతఁగాదు దెబ్బలుతినుపని నాచేతఁగాదు.

ఉద్దండ— మిత్రులారా. మాపట్టణమంతయుఁ బాడుపడినట్టున్నది. క్రొత్తజీవులు మనపురికి రాకపోయిననుఁ బోనిమ్ము మనము దెచ్చియుంచిన పాతవారు సైతము యమకింకరులను పడఁదన్ని విష్ణులోకంబునకు వెళ్ళినారు. మనచిత్రగుప్తులవారు పోయినవారెవరని విచారించుచున్నారుగాని క్రొత్తజీవుల పుస్తకమే యెత్తరు. మనదొరగారు సభకు సైతము రారు.

చండోదు—నిజము- నిజము ద్వారాలయింట విడిమట్టుగానుండు పాపిజీవులనేకులు జ్వలనజ్వాలలలోనుండి ధూమమార్గంబునఁ దప్పించికొనిపోయిరి. దేవాలయాధికారులు, భార్యను వదిలినవారు, అనృతము పలుకువారు, ఋణముదీర్పనివారు, గోవిప్రహంతలు, పరదారనిందకులు, రాజద్రోహులు, భాతృద్రోహులు, లంచములు దినువారు, న్యాయముదీర్పనివారు, నరకశతంబులఁబడి బాధపడుచుండిరి కదా. వారందఱు తెటులనో తప్పించుకొని వెళ్ళిపోయినారు

ప్రచండ—ఇటులగుటకుఁ గారణమేమో తెలియదు.

ఉద్దండ— ఆకారణంబు తెలిసికొంటి. రావలెనని కదా మనరాజు నేడు బ్రహ్మవద్దకు సత్యలోకంబునకు వెళ్లుచున్నాడు.

చండు—ఏమీ. మునరాజా సత్యలోకంబునకు వెళ్లుచున్నవాఁడా? అటులయిన మనముఁబోయి యా లోకంబుఁజూచివత్తము.

ప్రచండ—మునరాజా మముఁబోలువారిని సత్యలోకమునకుఁబిలిచి కొని పోవునా? చాలు చాలు. మనయిండ్లకుఁబోయి బాగుగఁదిని హాయిగఁ బండుకొందము రండు.

(నిష్క్రమణము).

ద్వితీయాంకము.

ద్వితీయరంగము- సత్యలోకము.

బ్రహ్మ, నారదుఁడు, యముఁడు మోహిని.

బ్రహ్మ— (నారదునిఁజూచి)- నారదా: అనేకకోటివత్సరంబులుగ మానవకోటిని సృష్టించుచున్నాను- ఆదిమసృష్టికిఁ బ్రకృతిపురుష తత్వంబులెటు మూలకారణంబులయ్యెనో యారీతి మానవసృష్టికి స్త్రీపురుషరూపంబులు కారణంబులయ్యెను. అందు సౌందర్యపరిమితికి పురుషప్రపంచంబునఁ బంచాయుధుండుతగునని సంతసించితి. అటులనే స్త్రీసౌందర్యపరిమితి యింతయనిలక్ష్యముగనుంటకు రంభాద్యప్సరసలను రతిని సృజించితినిఁగాని సృష్టినైపుణియం దంతటి పెంపుపొగడికకు వారు తగినవారు కారు. స్త్రీసౌందర్యపరిణామంబింత యంతకంటె హెచ్చులేదని స్థాపించుటకై యొకరూపవతిని సృజింప యత్నించితిని. తద్విషయంబున నీయభిప్రాయమేమి?

నారదుఁడు—జనకా: ప్రళయకాలంబున సర్వప్రపంచతత్వంబులు తన యుదరమునందిముడ్చి వాతాయుతాళిపత్రంబున వెలుఁగు విశ్వస్వ

రూపుల నాధికములమున నిచ్ఛామాత్రమునఁ బొడమి. సృష్టినిర్మాణ మునకు దుదరిగాని విజ్ఞానభాండమైన నీవీరీతి నన్నుఁ బ్రశ్నించుట యత్యద్భుతంబుగనున్నయది. నీకుఁ దెలియని విషయంబు నాకుఁ దెలియునా? అయినను మిమ్ముఁబోలు పూజ్యులడిగినపుడు నేనూరకుంటతగదు. అట్టి స్త్రీరత్నంబును సృజించుటచే బ్రపంచంబునకుఁ జేటు వచ్చుఁగాని మేలురాదు. మున్ను సుందోపసుందులను దానవులు సోదరులయి, పిదప, నొకనికిఁగాను వైరులయి ప్రాణంబులు త్యజించిరి. స్త్రీలయందు పురుషుల నాకర్షించు మోహపాశంబున్నది. అందులో నైకసుందరిని, లలితలావణ్య లక్షణయుతనుఁ జూచినఁ బురుషులనేకులు తల్లభ్యమునకై ప్రాణంబులైనఁ ద్యజింతురు. కావున నంతటిసౌందర్య స్త్రీ సృష్టి తగదని నాకుఁ దోఁచెను

బ్రహ్మ—నారదా! నీపలికిన పలుకులర్థంబులు. అయినను ధర్మరూపంబనియు నధర్మరూపంబనియు ధర్మాధర్మోభయరూపంబనియును మూఁడురూపములు మానవులయందు సృష్ట్యాదిని నేఁగల్పించినాడను. కేవలధర్మస్వరూపులను స్త్రీమాయ జయింపదు. వారు కైవల్య పదవినంది సుఖింతురు. ధర్మాధర్మస్వరూపులను స్త్రీమాయ యొకవేళ జయించినను దుదకది క్షీణించును. అట్టివారికి స్వర్గాదిలోక సుఖంబు గలుగు. కేవలాధర్మస్వరూపులను మాత్రము స్త్రీమాయ, పూర్ణముగ జయించి వారిని గేవలపాపకర్మంబులకు దించును. అట్టివారు నరకకూపములంబడి పొర్లుదురు. నైసర్గికసృష్టియందే యీగుణావగుణంబు లేర్పడినవిగాన నిపుడవి హెచ్చుతగ్గులగుటకుఁ గారణంబులులేవు. మానవుఁడు విజ్ఞానంబుచే సుకర్మలాచరించుటకును, సుకర్మములాచరించి విజ్ఞానంబు హెచ్చుకొనుటకును వానికి బుద్ధిసాహాయ్యకారిగానుండును. ఆబుద్ధిని సుధయుక్తంబుఁ జేసికొనైననుఁ జెడదు,

(యముని ప్రవేశము).

యముఁడు: క॥ అభివందనములు నలినాసన

త్రిభువనసంస్తుత్య, భారతీపతి, సద్వి

ద్యాభాస్పద, విబుధాళీ

శుభకర, మాచరణములకు, శుద్ధచరిత్రా

దేవా: నిజభక్తలోకార్తిహరణంబులు, త్రిభువనభరణంబులు, భయరోగార్తిహరణంబులు, జగదుపకరణంబులు, యోగీంద్రమానసాభరణంబులు- రక్తకమలారుణంబులగు నీచరణంబులకు నమస్కరించెద. (నమస్కరించి) (నారదునింజూచి) జ్ఞానవిశారదా, మునిలోకమానసామోదములు, నిరస్తభక్తఖేదములు, కలికలుషవిషాదంబులు, భవపాశచ్ఛేదములునగు తావకపాదములకు వందనంబొనర్చెద. (అనుచునతులొనరించును).

బ్రహ్మ॥ ఉ॥ భద్రమె నీకు దండధర, భద్రమె నీదగు రాజ్యలక్ష్మియున్,
భద్రమె నీయమాత్యులును, భద్రమె నీభటవర్గమెల్ల, ని
ర్నిద్రతదండనీతి యవినీతుల మర్త్యుల పాలుసేయుచుండె ?
క్షుద్రులు దైత్యులెల్ల నిను సొంపుఁజేయరుగా రణావనిన్ ?

యముఁడు—సరసీరుహగర్భా! తావకాశీర్వాదఫలంబున మా క్షేమంబునకే కొంతయును లేదు.

బ్రహ్మ—కృతాంతా: అట్లైన నీవుడు రాజ్యంబువదలి యిచటికి రాఁగతంబేమి?

యముఁడు—భారతీవల్లభా: రాజ్యంబునందుండి నేఁజేయఁదగినపని యేమియు లేదు. పనిలేక యూరకకూర్చునియుండఁజాలక భవద్దర్శనంబునకై వచ్చితి.

బ్రహ్మ—ఏమీ! సమవర్తీ! ఎడతెగక రేలుంబవళ్లు చేసినను పనిసమయకుండలేదే! ఇపుడుపని లేమికిఁ గారణంబేమి?

యముఁడు—దేవా: కారణంబు నాకును దెలియదు. మర్త్యలోకంబునుండి యొక జీవితుండైనను నాపురిఁ జేరఁడు. పాతవారున్నైత మొక్కటుకు నిలువక విష్ణులోకంబునకు వెళ్ళిరి. కావుననే నాకును చిత్రగుప్తునకును నాభటవర్గమునకు నేమియుఁబని లేదు.

బ్రహ్మ—ఏమీ- ఏమీ- ఎట్టెట్టూ: మర్త్యలోకంబుననుండి యొకపాపి జీవియైన నీపోలికి రాఁడాయెనా! (నారదునింజూచి) కుమారా ఇవ్వార్త యద్భుతావహముగదా! దీనికిఁగారణమేముండునో!

నారదు—జనకా: తమచేఁబలుకంబడిన యధర్మస్వరూపంబులును ధర్మాధర్మోభయస్వరూపంబులును ధర్మస్వరూపములుగా మాఱినవి.

బ్రహ్మ—అటుమాఱుటకుఁ గారణంబేమి?

నారదు—జనకా:

ఉ॥ భంగవిహీనశైత్య కలభంగుని. మానిమనోంబుజాత సా
రంగుని, పక్షిరాజతురంగుని, ముక్తిరమానుషంగునిన్,
మంగళమూర్తినిన్, హరిని, మానసపీఠమునందునిల్పి రు
క్మాంగదుఁడన్ విభుండు వనమాలివ్రతంబును సల్పుచుండెడున్।

తండ్రీ! హరివాసర వ్రతంబునకు భంగమురానియ్యక రుక్మాంగద చక్రవర్తియును తజ్జనులును సలుపుచుండు కారణంబున వారు తమ యధర్మస్వరూపంబులు జ్వలనజ్వాలలంబడిన యింధనములమాడ్కి దహించి విజ్ఞానస్వరూపంబుఁబూని వైకుంఠవాసులగుచున్నవారు- భూలోకంబున జనులాచరించు పుణ్యకర్మఫలంబున వారితండ్రితాతలు నైతమీదండధరునిన్ దండించి విష్ణులోకంబుఁ జేరుదురు.

బ్రహ్మ—నారదా: ఇటులైన భూజనులెల్లరు విష్ణుసాయుజ్యపదవినందుదురు. నాకు పునస్సృష్టియను కష్టతమంబగు పనిపడును. కావున నాన్నృపోత్తముని వ్రతంబునకు భంగంబుగల్పింప యత్నించెద (దండధరునింజూచి) దండధరా! నీలోకంబుజేరి సుఖంబుననుండుము. (నారదునింజూచి) నారదా- నీవును త్రిజగంబులు సంచరించి యచ్చటచ్చటజరుగు వినోదంబులు చూచిరమ్ము.

(నారద యములు నిష్క్రమింతురు).

మదీక్షితంబుఁ గొనసాగింపనేఁడు సమయంబు తటస్థించె. కావునఁగ నాలోచించి త్రిలోకైక సుందరిని నొక మానినిని సృజించి తన్మాలంబున రుక్మాంగదుని వ్రతభంగంబుఁగల్పించెద. నారులుగదా పురుష హృదయాంతర్గత ధైర్యధరాధర పవిధారలు. కాన నిపుడే యట్టి సుందరినిసృజించెద. (అనుచునించుక యున్మీలిత నేత్రుఁడైనిలిచి).

ఉ॥ సోగమెఱుంగు తీఁజమున సోయగమందిన పూవుఁదీగయో
నాగవెలుంగుచుక్క బురుషనాగకులాంతకమై చెలంగుచుక్
వా గమృతంబుఁ జిల్కుచును, వారిజపత్ర విశాలలోచనా!
తీగమెరావె మోహినీ, నవీనవిలాసవతీ వినోదినీ॥

(మోహిని ప్రవేశము).

మోహిని—(బ్రహ్మదేవునకు నమస్కరించి)

ఉ॥ అంబురుహాసనా! సుమహిమాంబునిధాన, త్రిలోకపాలకా,
యంబురుహాక్షసూన, చతురానన, దీనజనావనా, సృజిం
పం బనియేమినన్నిటు ప్రపంచమునన్ ? గృపఁబల్కు కావుతా,
సంబరమొప్పనప్పదను సాహసమెల్లను విచ్చఁజెప్పుచుక్॥

యతిజనసేవ్యమానా- పరమాత్మా! నన్నుసృజింపఁబనియేమి? వని వినిమొద తెలుపుము,

బ్రహ్మ— మోహినీ- సౌందర్యలావణ్యవాహినీ- ప్రత్యగ్రశతపత్ర గేహినీ- నీనుండియొక మహాకార్యంబు కాఁదగియున్నది. వైదిశాపురంబునేలు రుక్మాంగదచక్రవర్తి యతిధృతినవలంబించి హరివాసరవ్రతంబు సలుపుచున్నవాఁడు. అతనిఁ గూడి తద్రాష్ట్రజనులు సైతమావ్రతంబాచరించి విష్ణులోకంబునకుఁ బోవుచున్నారు. ఇటు లగుటచే యమలోకంబు పాడుపడినది. మర్త్యాళి విష్ణులోకంబుచ

జేయు కారణంబున వారికిఁ బునర్జన్మంబు లేకపోవును. దానిచేఁగా లాంతరమున భూలోకంబు నైతము పాడుపడి మరల వేన్సృష్టికిఁ బ్రారంభించు కాలంబువచ్చును. కావున నీవెట్టులయిన నాథరా వసుని ధైర్యైకవచంబుభేదింపి హరివాసరవ్రతదీక్ష మఱచులాగొన రింపుము.

సీ॥ కలికి! నీ వితికావ్యకవ్వ చీకటిఁగప్పి, యీ నృపాలుని జ్ఞానమడఁగఁ ద్రొక్క-
కాల! నీ నిటువాలు మీలుఁబోలెడుచూపు లంపరనృపుధైర్య మనిమఁజెల్ప
నాళీకవదన! మృణాళనాళకరాగ్ర పాశంబులను వానిఁ బట్టికట్టు
చక్రవాకస్తని! చక్రవర్తులకటిచక్రదాసుగ నేలు చక్రవర్తిఁ

గీ॥ చిగురువాతెఱ ముసిముసినగవు తేఱ
వ్రతము వెలిగాఁగ నీమతి యతిశయింప
సరసిజానన! ముంపుమా సార్వభౌము
సరససౌందర్యలావణ్య సాగరమున॥

కామినీ- మత్తగజగామినీ- ఈపని యల్పమనియెన్నకు. వైళమ్మె భూలోకమ్మునకుఁజని యెట్టులనయిన నానృపాలునిఁ గని మఱుమాయలచే వానిని నీమోహఁపు వలలోఁగొని నన్ను ముదబ్ధిలోఁ దేల్పుము.

మోహిని—తండ్రీ! నీపనిఁగొని యొకమనుజుని నావశునిగఁజేసికొనుట నాకొకపెద్దపనియని నేఁదలఁపను. అయిన నిప్పుని కలుషమూలంబని నేఁజింతించెద.

బ్రహ్మ—మోహినీ ఇప్పుని దైవసమ్మతమ్ము గావున నీకేపాపంబునురాదు. నమ్ముము.

మోహిని—జనకా- అట్టులయిన నేఁబోయివచ్చెద.

బ్రహ్మ—కూఁతురా- నీకుఁదోడ్పాటుగఁ జెలులను గొందఱిని నీవెంటఁ బిలిచికొనిపొమ్ము.

మోహిని—తండ్రీ- మాచివి పోయివచ్చెద. వందనంబులొనర్చెద.

బ్రహ్మ—బిడ్డా- నీకు శుభమగుగాక.

(మోహిని నిష్క్రమణము).

ఈమోహిని నేఁదలఁచినంతపనిఁ జేయును. అయినను దానికిసాహాయ్యముగ మారుని, మలయమారుతుని, శీతకరునిఁ బంపవలెను పంపెద.

(నిష్క్రమణము)

ద్వితీయాంకము.

తృతీయరంగము.

శ్రీహరికథ

శ్లోకం॥ శుక్లాంబరధరంవిష్ణుం- శశివర్ణం చతుర్భుజం.
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వ విఘ్నోపశాంతయే॥
అగజానవపద్మార్కం గజానవమహర్నిశం॥
అనేకదంతంభక్తానా మేకదంతముపాస్మహే॥

వ॥ జలరూపాయ, చరాచరాత్మకజగత్సంస్థాయ, లక్ష్మీమహీలలితేశాయ, శరాశరాళియఘనాలాప్యాయ, దేవోత్తమాయ, లతొరాత్పత్తివివర్జితాయ, సుజనాయత్తాంతరంగాయ, శేషలకారుణ్య కటాక్ష వీక్షణపరివాహాయ, శుభ్యంనమః॥,

(వరాహపురాణములోనిది)

జ్ఞానానందస్వరూపుఁడును ననంతకల్యాణగుణపరిపూర్ణుఁడును నగు నారాయణుండు భుజగేంద్రశయ్యాపైఁ బవళించి తనపూర్వావతార చరితలందలంచుచు యోగనిద్రాసుఖవకేళినుండ నతనినాభిరంధ్రాంతరంబునుండి యొక్కకమలంబుద్భవించె. ఆపద్మమున జగత్సృష్టికారణుండగు బ్రహ్మజనించె. అతనికర్ణరంధ్రములనుండి దశదిశలు కన్యాకారంబులుదాల్చిపుట్టిరి. దశదిశాకన్యకలు దశమీదినంబుననుద్భవించిరి కావున నాదశమీదినంబు పుణ్యదినంబై ప్రసిద్ధికెక్కెను. ఆకమలోద్భవుఁడు యోగనిద్రాపరతనున్న నారాయణునిఁజూచి యీరీతి వేఁడికొనెనఁట.

క॥ వారిధిశయాన, లెమ్మా
నీరజదళనయన నీవు నిద్దురజెందన్
వారియుఁబోఁడదు సృష్టికి
నారాయణ నాదు వొందనమ్ములఁగొనుమా॥

ఈరీతి భారతీపతినుతింప దుర్వారకలుషజిష్ణుఁడైన విష్ణువు మేల్కాని యజునిఁగాంచివత్సా! ననుమేల్కానఁజేసిన కారణంబేమనియడుగ విధాత పలికిన విధం బెట్టిదియనిన.

ఉ॥ పాహి యశోనికాయ, నిరపాయశుభోదయ, విస్ఫురద్వయా,
పాహి మునీంద్రగేయ, యహిపాంచితశయ్య, యజేయకాయ, యో
శ్రీహరి! సర్వలోకములు చెల్వువహించెను నీదుబొజ్జయన్
గేహముగాఁగ, జావ్యమిది కేవలమూర్యతఁ దోఁచునిత్తఱిన్॥

శ్రీమన్నారాయణా! నీవుజాగరూకతఁదాల్చి యనేకావతారంబులెత్తి లోకంబునుద్ధరింపుమని బ్రహ్మ వేఁడఁదనయునివినయాలాపంబులకు మెచ్చి యఖిలలోకైకవర్తిష్ణుఁడు విష్ణువై జనించెను. ఆమహావిష్ణువు జన్మదినంబు ద్వాదశికావున యీ దినంబు పుణ్యైకదినంబై ప్రసిద్ధికెక్కెను. అజుఁడునిజవాక్యనైపుణిచే శ్రీమన్నారాయణునినుతించుచుండ నతనిశరీ

రాంతర్గత ప్రాణవాయువు నిర్గమించి బాహ్యప్రపంచంబెల్ల భూరా కారత వ్యాపింప విఘాతగాంచి యోప్రభంజనా! నీవు విశ్వాధికారివై సకల శుభములకాలవాలమై వాయువ్యాధికారిగ నుంటుమని వరమిచ్చెను. ఆదినం బేకాదశి కావున నది సకలశుభావహదినమయ్యెను. శుక్ల దినంబులు నారాయణావతారోదయ శుభదినంబులుగావున నాది నంబులందు సకలవిషయములను మఱచి శ్రీమన్నారాయణారాధనా పరులై యుండవలెను. అట్టియారాధనకుఁ జిత్తశుద్ధి యావశ్యకంబు. చిత్తశుద్ధికి శారీరశుద్ధి ముఖ్యకారణంబు కావున మానవుఁడు స్నానా హారవిహారాదుల జాగరూకతఁగలిగి శారీరశుద్ధి నార్జింపవలెను. తచ్ఛు ద్ధికి నుపవాసంబు ముఖ్యసాధనంబు. ఏలయన మనము దినదినముఁగొనెడి యాహారంబు విధ్యుక్త పరిమితికి మించియుండుకారణంబున జఠ రాగ్నిచేఁ బచనంబుఁగాక స్వల్పమాత్ర మనారోగ్యపదార్థంబు దిన దినంబు నిలిచియుండును. ఆ యశుద్ధపదార్థం బుపవాసమ్మునఁగాల్పకున్న యనారోగ్యము హెచ్చయి జ్వరాదిబాధలకు దేహముగుఱియగును. కావున ప్రాజ్ఞులా హరివాసరములం దుపవసించినచో నైహికపార మార్థిక సుఖంబులు మానవులకుఁగలుగునని వచించిరి. ఇట్టి హరివాసర వ్రతంబు సలిపిననరులనేకులు చిరకాలంబీ ప్రపంచకసుఖంబులనుభ వించి మోక్షంబునందిరనుటకుఁ బౌరాణికదృష్టాంతంబు లనేకంబులు న్నవి, అందునొక కథ యీరాత్రికాలక్షేపంబునకై యేర్పఱిచితిని.

పాట.

(గేయము) యశోవిశాలుఁడు- విశాలపురపతి। విశేషధార్మికుఁడు।
ప్రశస్తగుణగణ పరీతహృదయుఁడు ప్రాజ్ఞుఁడుధరలోన॥౧॥
బృహదశ్వుండని పేరుపొందిన మహీనాధీశుండు।
అహరహమాహరి సేవమఱవని విహితాచారుండు॥౨॥

కాంతామతియును కాంతఁగూడుచు సంతసంబుగాంచి।
కాంతుజనకుని సేవనుండె ని। రంతరంబునందు॥౩॥
భాసురమునిజన పాలకుఁడగు దూ। ర్వాసుండొకదినము।
వాసిగధరణీపాలునిసరసకు వచ్చెనురభసముగ॥౪॥

ఈరీతి బృహదశ్వుఁడు తనకాంతయగు కాంతామతి సహితుఁడై కంతు జనకునికొలువున స్వాంతమిడి నిరంతరము సంతసించుచుండెను. ఒకానొకదినమున దూర్వాసుండు భూలోకసంచారంబు సేయుచు సమస్త రాజులనుఁ బరీక్షింపయత్నించినవాఁడై సర్వ సర్వంసహాధీశుల సరస కుంజని వారిసపర్యలనందియు వారియందు వైభవాధికులమనుగర్వం బుఁగాంచెను. ఎట్టివారికిని నీగర్వంబు సహజముగనుండుననుట కొకయుపకథయున్నది.

సీ॥ సతులలో సౌందర్యవతిని నేనని సత్య। భామగర్వించెను భావమునను
అక్షీణ బటుబలాఢ్యుఁడ నేనని। పక్షిరాజహమించె భావమునను
విష్ణుభక్తిని గానవిద్యను హెచ్చని। గర్వించెఁ జెలరేగి కలహమౌని
స్వరశాస్త్రమందున సరిలేదు తనకని। తుంబురుండహమించె నంబరమున॥

గీ॥ వారిజాతాయతాక్షుఁడు నీగర్వ
భంగమొనరింప మదిఁదాన్న భవ్యమునుచు
నంత నారదకుంభువు లధికకలహ
మౌనివచ్చిరి వారిసన్నిధానమునకు॥

ఆకాలంబున సత్యభామ తానతిసౌందర్యవతియనియును గావుననే తన పతి సదాకాలంబు తన్నెడఁబాయకుండుననియును తానేపతివ్రతయని యును మనమున భావించి మారజనకునితో ముచ్చటలాడుచుండెను. గరుత్మంతుఁడెదుటనిలచి ముజ్జగంబుల బొజ్జలోమోయువెన్నునిఁదా వెన్ను

పై నిడుకొని యీరేడులోకంబులు సలీలగా సంచరించు తనసామర్థ్యంబునకు సంతసించుచుండెను. అట్టితఱి నారదతుంబురులువచ్చి శ్రీహరికి నమస్కరించి మహానుభావా! దేవదేవా! గానవిద్యలో మాయిరువురికిని గలహంబు తటస్థించినది. గానలోలుఁడవగు నీవుదప్ప మఱియెవరును మాపాండిత్యతారతమ్యంబుఁ దెలుపఁజాలరు. కావున మముఁబరీక్షించి యెవరు హెచ్చుపాండిత్యముగలవారని నిర్ధరింపుమా యనివేఁడఁ బరమాత్ముఁడిదియ వీరందఱి గర్వాపహరణమునకు సమయమని మదినెన్ని నారదతుంబురులఁ జూచి తాపసోత్తములారా! మీవివాదంబుఁ దీర్ప నే శక్తుఁడనుగాను. గంధమాదనపర్వతంబు నందాంజనేయు లున్నవారు. వారుగాని మఱియేరు మీమీగానవిద్యానిపుణతఁగనఁజాలరని సెలవిచ్చెను. నారదతుంబురులదివిని దేవా! మమ్మునీరీతి హేళనసేయనేల? కేవలవానరుఁడెటు మావిద్యగ్రహింపఁగలఁడని బదులిడ శ్రీహరి పలికిన విధంబెట్టిదియన, తాపసోత్తములారా! మీరటుసందియింపకుఁడు. వానరుఁడైనను గానవిద్యానిపుణుఁడనిపలుక నారదతుంబురులువిని దేవా! అతఁడిచటికి వచ్చువిధంబెట్టిదియనిన జగన్నాటకసూత్రధారియగు శ్రీహరి గరుత్మంతునిఁజూచి సుపర్ణా: నీవువైళమ్మునఁజని యాంజనేయునిఁ బిలిచికొనిరమ్మని యానతిచ్చెను. గరుత్మంతుఁడదివిని మహాప్రభూ: ఇపుడేపట్టితెచ్చెద.

కం॥ వచ్చెదనిపుడే కపివరుఁ
దెచ్చెద నిమిషంబులోనఁ దేఁకువ హెచ్చన్
సచ్చరితా! పనివినియెద
నచ్చుగనని గరుఁడుఁడరిగె నటకీస్థలికిన్॥

అటుపక్షిరాజు గంధమాదనంబుచేరి యచటఁదనవాలమే కోటగఁగట్టికొని బాహ్యేంద్రియములఁ బాఱఁదోలి యంతరేంద్రియముల నిగ్రంధించి

సీ॥ రామ రఘురామ శ్రీరామ రామ రామ
జానకీరామ జయరామ సద్గుణాభి
రామ రాఘవ దశరథరామ యనుచు
పరమపురుషునిఁ బొడఁగాంచెఁ బక్షిరాజు॥

అటు గాంచి, యమ్మహానుభావుని మహిమాతిశయంబుఁ గనఁగలేక కేవల కపిమాత్రుఁడని తలంచి, ఓరీ వానరా! ఓరీ తరుచరా! లెమ్ము. శ్రీహరి నిన్నుఁబిలుచుచున్నవాఁడు. వేగమ్మెరమ్మని గర్వించి పలికెనుగాని, యా దివ్యపురుషుఁడు రామనామస్మరణానందలీనుఁడై వేఱొకప్రపంచంబు గనక, వినక, మోఁకుపడిన చెట్టుఁబలెనుండెను. అపుడా సుపర్ణేశుండు ఔరా! యీకపిగర్వము! పిలిచినను జూడక నోరెత్తియఁబదినను గనక శ్రీహరియానతి నరకుసేయక యున్నవాఁడు. వీనికిఁదగిన శాస్తి చేయక తప్పదని మదినెంచి వజ్రధారనుంబోలు గోళ్ళతోను, ముక్కుతోను, నా రామభక్తుని వాలంబుగీఱి పొడచుచునుండ నమ్మహాత్ముఁడట్టె వాలంబెత్తి యొకదెబ్బఁదీయఁ బక్షిరాజు గొట్టుకొనిపోయి శ్రీహరి చరణంబులపైఁ బడి మహానుభావా! నాప్రాణంబులుదక్కెను. నాగర్వభంగమాయెను. ఆమహాత్ముండు కేవలవానరుఁడుగాఁడు. మీరే యవతారమెత్తి యాకపి రూపంబుఁ దాల్చితిరని నేనమ్మెద. కాదేని వాలము నించుక విదలించిన తోడన నాప్రాణంబిటు తల్లడిల్లనేఁబడనేల యనిపలుక శ్రీహరి గరుత్మంతుని యాదరించి సుపర్ణా! నీవాకపివరుని నేమని పిలిచితివి యని యడుగ మీయానతి రమ్మని పిలిచితినని గరుడుఁడు మారుపలికెనఁట. అపుడు నారాయణుండు వైనతేయా! ఈతూరి మరలఁబోయి శ్రీరాములు నిన్నుఁబిలిచికొనిరమ్మనిరని పలికినచో నిను మన్నించి యాంజనేయుండు వచ్చును త్వరలో బిలుచుకొనిరమ్మని పంప ఖగేశ్వరుఁడు డోలాయమాన చిత్తుఁడై భయగ్రస్తమానసవృత్తి నవలంబించి యెట్టకేలకు ధైర్యంబవలంబించి యంజనానందనుఁజేరి మహాత్మా! శ్రీరాములవారు నిమ్ముఁబిలిచి

రమ్మనిరి వత్తునాయని వినయాలాపములు పలికిన హనుమంతుఁడు శ్రీరామశబ్దము వీనులఁబడఁగనె లేచి గరుత్మంతునిఁగని క్షమింపు మిపుడే వచ్చెదనని గరుత్మంతుని వెన్నంటి రానారంభించెనట. ఇచట శ్రీకృష్ణుండు తనసతియగు సత్యభామనుఁగని నాముద్దులమోహనాంగీ! సత్యభామా: శ్రీరాముల దర్శనంబునకై యాంజనేయులు వచ్చును. ఆ మహానుభావుండు వచ్చునంతలో నేను శ్రీరామావతారంబెత్తెద, నీవు వైళమ్మె సీతవుగమ్ము. అటుచేయనిచో నాంజనేయుండు కోపమున మము నేమిచేయునో తెలియదు. కావున త్వరలో జానకివిగమ్మనిపలుక సత్యభామకు నేమియుఁదోఁపక నాథా!

కం॥ మున్నెన్నఁడేని సీతను
కన్నారఁగఁజూచి యెఱుఁగఁ, గానని దానన్
నెన్నారసాటుల మదిఁగని
పన్నుదువేషంబు సాధ్యపడ దిది నాథా॥

నాథా! యీపని నాకసాధ్యంబనెను. అపుడు శ్రీహరి యచ్చెరువువడిన వానింబలెనటించి భామా! నీవు మహాపతివతవు! ఎట్టిరూపంబైనఁదాల్ప నేర్తువనితలంచితి, అయిన నేమాయె. రుక్మిణిని విచారించెదనని రుక్మిణిఁ బిలిచి సతీ! నీవు సీతవుగమ్ము నేను రాముఁడనయ్యెదననినంతనె పతివ్రతాశిరోమణియైన రుక్మిణి వెంటనె తనజడవిప్పి వారకొప్పుఁబెట్టి పయ్యెదఁ జక్కఁగఁదిద్దికొని సీతయైనిలిచెను సత్యభామ దానిఁగని ముఖమువంచికొని నిలిచెను. అనంతరంబు వైనతేయుండాంజనేయ సహితుఁడై రా హనుమంతుఁడు శ్రీరాములనుఁజూచి యానందబాష్పపూరితలోచనుండై

ఉ॥ ధన్యుఁడనైతి నేనిపుడు దాశరథీ; కరుణారసాంబుధీ!
మాన్యుఁడనైతి నేను బ్రతిమార్గ విచారవిహారతత్పరా!

యన్యముఁగోర. నీశుభపదాంబుజ సంస్మరణంబు దప్పఁగా
దైన్యమువీఁట నేఁడుదును దాశరథ రాఘవ రామ! మొ)క్కెదన్.

ఈరీతినత్యార్తుఁడై భక్తిరసాంబుధి నోలలాడుచు వేఁడు నిజభక్తుని పవమానసుతునిఁగని శ్రీహరి సంతసించి వత్సా! బహుకాలంబునకు నిన్నుఁ గంటిని. నను మఱవక యున్న వాఁడవని సంతసించితి. నాభక్తులలో నగ్రేసరుఁడవు నీవు. బాలకా! నిన్నిపుడురప్పించిన కారణంబేమనిన నీతాపసోత్తములు నారదతుంబురులు గానవిద్యాప్రవీణులై పరస్పరజయాకాంక్షులై యిచటికి వచ్చినారు. వారిగానవిద్యను బరీక్షింప నీవే తగుదువని నిన్నుఁబిలిపించితిని, కావున వీరికిఁ గానవిద్యాప్రవీణత కలదో లేదో పరీక్షింపుమనిన వానరమూర్తి సంతసించి నారదతుంబురులచేత నుండు తాళములు తాఁగొని యీరీతి నొకపాటను బాడెనఁట.

పాట. (చివరను వ్రాయఁబడినది)

ఆరీతిగా నాలాపంబు సేయుచుండ నందున్న యొకరాయి కరిగి నీరై యుండ నానీటిలో నారదతుంబురుల తాళములు వసవైచి నిలిచెను. ఆనీరు మరల ఘనీభవించి తాళములు లోఁబడికట్టనది చూచి అంజనానందనుండు ఓ నారదతుంబురులారా! మీమీగానప్రవీణతఁజూపి మీమీ తాళములు తీసుకొనుఁడని పలుక నారదతుంబురులెంత పాడినను పాషాణంబు నీరుగాదయ్యెను. అపుడంజనానందనుండు మీయుభయులకు గానప్రవీణత లేదని వారిగర్వభంగంబుఁ గావించి సీతారాములకు నమస్కరించి వారి యాశీర్వాదంబులుగొని వారియాజ్ఞనఁది తనదారి తానుపోయెను. ఎంతటి మతిమంతులకైన నించుక గర్వముండక మానదు. కావున దూర్వాసుఁడంతటివాఁడైన గర్వరహితచక్రవర్తి కలఁడాయని యరయుచునుండనుఁగావక తుదకు బృహదశ్వమహీపాలుని కరసకురా బృహదశ్వుండు సతీసమేతుఁడైవచ్చి యమ్మునికినర్ఘ్యపాద్యంబులిచ్చి నమస్కరించి పీఠమునకూర్చుండఁబెట్టి

ఉ॥ భూతదయానుశీలనత; భూరితపోధన, దీనబాంధవా;
నాతిరమే మిముఁ గాఁ బొగడ? నాజననంబు పవిత్రమయ్యె; నీ
శ్రీపదాంబుజాత పరిభూషిత మస్తకమయ్యెఁ గావునన్
నీతివిశారదా! వరమునీ! యభివందన మాచరించెదన్॥

ఈకీర్తిఁ బొగడు సతీపతులనుఁజూచి సంతసించి వారియంతరంగంబు నిష్కపట సుగుణస్థానంబనితలఁచి యిట్టి నిగర్వశిరోమణులగుదంపతులు త్రిలోకంబున నుండరాయని యచ్చెరువందుచు విచ్చవడినిలువ, భద్రాశ్వుండిగని మహానుభావా: హర్షమునకుఁ గారణంబేమని యడుగ దుర్వాసుండు కరుణించి మహీపాలా! ఈ నీకులసతి పూర్వజన్మమున శూద్రాన్వయమునజనించి యొకవైశ్యునింటి దాసియై యుండెను. దానికి విటుఁడవై నీవు తిరుగుచుంటివి. ఆవైశ్యశిఖామణి యాశ్వయుజ శుద్ధద్వాదశీదినంబునఁ బద్మనాభవ్రతంబు సలుపుచు విష్ణుదేవాలయంబున దీపమాలికలుంచి మీయిరువురినిఁ గావలిపెట్టెను. మీరతి ప్రయత్నంబున నాదీపమాలికలఁగాంచిన పుణ్యంబున మీకీజన్మంబుననింతటి భోగంబుసిద్ధించె. హరిభక్తినేమఱక యుండువారు మీరు కావున గర్వమను వస్తువు మిమ్ము సమీపింపవెఱచుచున్నది. యిదియంతయు నేకాదశీ వ్రతఫలంబని హర్షించితి నని వాక్రుచ్చి ముని యథేచ్ఛంబోయెను. ఈమహిని మాధవవ్రతము మానక సేయువానికి మహితైశ్వర్యంబులుగలుగును. కావున మానవులారా- మీరీవ్రతము మానక సేయుఁడు.

మంగళము.

పాట (బిగనవ్రాయఁబడినది).

తృతీయాఙ్కము.

ప్రథమరంగము.

పీఠి.

విదిశాపురము, యువజనులు, రాగేశ్వరుఁడు, భోగేశ్వరుఁడు
జోగీశ్వరుఁడు.

రాగేశ్వరుఁడు — హా- హా- ఎంతమనోహరమగుగానము! నేనిన్నివర్షంబులు ప్రపంచంబునందుండు గాయకులవద్ద కష్టపడి నేర్చిన విద్యయంతయు నామానినీమణి కమనీయగాననైపుణిలోఁ గోట్యంశమైనరాదని నేనెన్నెద.

సీ॥ కలకంఠకుల కుహూకలనాదములయించు కంఠనినాదవైఖరియె ఘనత
ముదిత, రక్తినిపంచి మోహించి పాడెడు పంచమస్వరజాతి పాట ఘనత
తాళమానంబులఁ దాళికులఁగూర్చి పల్లవజాతుల నల్లు ఘనత
ఆరోహణావరోహణముల కుదిమార్చనలసొంపు హెచ్చించి సొలయు ఘనత

గీ॥ స్వరములను చేర్చి శ్రుతులలో బెరయఁ జేర్చి
సురుచిరాలాపరాగ సంశుద్ధిఁ గాంచి
గానమొనరించుచున్న యాచాన, దివ్య
మానినీమణి యని యెంతు మానసమున॥

ఈగానంబు గానప్రియుఁడైన నారాజువినిన నాచాననువదలి యొకయడుగైనఁ జనఁజాలఁడు, నేఁబోయి, యీతరుణివార్త తెలిపెద. (నిష్క్రమము)

భోగేశ్వరుఁడు. ప్రవేశము.

భోగేశ్వర — ఔరా- ఆనారి యెంతటిసొగసరి. అది కిన్నరకన్యయో విద్యాధరనారియో, యురగతరుణియో, సిద్ధసతియో, సాధ్యమద

వతియో, గంధర్వకామినియో, మరుత్తరుణియో, గాని మానవ భామినికాదని నాకుఁదోఁచెడు. ఆమరుని యాముకేనుగుగున్న తిన్ననినడలు, ఆనవలామిన్న మిన్నుగలతోడలు, ఆ పూఁబోన్న మిన్ననరుకొను, ఆయున్ను మిన్న సొంన్నునగుమేను, ఆకులుకులు, ఆబెసుకులు, ఆతళుకులు, చూచువారికి మరునిములుకులై సోకును గదా: హా! హా! ఎంతటిది యీ యంగసౌందర్యము!

సీ॥ నిరుపమానవిలాస, నీహారకరహాస, యసదృశచాంపేయ కుసుమనాస,
బింబఫలాధర, పీనపయోధర, కంబుకంధర, కాలకంధచికుర,
రాజితరాజమరాళయానదితయాన, రాజీవలోచన, రాజవదన,
అంచితకాంచన చంచలాసమదేహ, నవకోమల మృణాళనాళబాహ,

గీ॥ స్వర్ణశుభగర్ణరుచిర శ్రీవర్ణకర్ణ,
పుల్లకమలారుణాభ విస్ఫురణ చరణ
విపులసికతాతల నితంబబింబవిభవ,
అఖిలలోకైక మోహిని యౌవనాంగి॥

ఆజగన్మోహిని- రాజభోగ్యవస్తువు గాని తదితరముగాదు. ఇవ్వార్త నారాజునకుఁ దెలిపెద. (నిష్క్రమణము).

భోగేశ్వరుఁడు—అయ్యో; పుత్రమిత్ర కళత్రక్షేత్రాదుల సంయోగము స్వప్నయోగంబనియెంచి, వైరాగ్యంబుఁగాంచి, యాలిని, సంపదాలినిఁ, ద్యజించి భవభయరోగ విపజ్జలార్ణవ వినిర్మగ్న మర్త్యాళికి నావయగు పరమేశ్వరునిఁ బూజించి, ముక్తినార్జించి, ధన్యుఁడనగుదునని యెంచితి. అరణ్యంబుననివసించితి. భీమేశ్వరునిఁ బూజింతి. అయ్యో; సమాధిఁజేరినను శనివదలదనునటుల యటవినిస్సైతము కుటిలాలక యెవతెయోవచ్చి చేరినది. నామానసంబెల్ల సమాధియోగంబునఁజేర్చి యప్రమత్తయోగంబున నుంటకు నెంత యత్నించినను నావధూటిచేష్టలు వహ్నివద్దనుండు వెన్నముంబోలె

నను గలిగించుచున్నయవి. ఆహా. ఈలోకంబునఁ జపలావలోకనల మోహపాశంబులుగదా యెంతటి పుణ్యపురుషుల నైనను బంధించి పుణ్యలోకంబునకు వెలిచేయును!

సీ॥ నిరవద్యులై యుండు నీతికోవిదులను నిరయంబునను ద్రోయ నేర్పఁ దగని
నిరతసత్కర్మలఁ బరిపూతులగువారిఁ దొరసి దుష్పథములఁ దేలుచఁ జెలువ
నియతాత్ములైనట్టి నిగమాంతవేదుల ధీరత్వమగలింపఁ దెలియు నాతి
నిత్యచిన్నిర్మల నియతాంతరంగుల మాయలోఁ బొరలింపఁ జేయఁ దెలియు॥

గీ॥ బ్రహ్మభావంబుఁ బడసిన ప్రాజ్ఞజనుల
భోగరాగాళిఁ ద్రోయును భువిని మగువ
కానఁ గాంతాళి విడనాడి కాననముల
మౌనవృత్తిని మనుచుందు మానవాళి॥

ఇటు మునివృత్తి నవలంబించి కానలోఁ గాలకంఠుని భజించుటకు నంతరాయంబుగ నిక్కాంత యీకాంతారమువచ్చి చేరినది. భూకాంతునకీ యుదంతంబుఁ దెలిపి యీమానినీభూతంబును గాననంబు నుండి తొలఁగించెద.

నిష్క్రమము.

తృతీయాఙ్కము.

ద్వితీయరంగము.

రాజగృహము.

రుక్మాంగదుఁడు. సంధ్యావళి.

సంధ్యావళి — నాథా. రేపు ప్రాతఃకాలంబునఁ దమరు ప్రయాణమై వింధ్యాటవికిఁ బోవుదురని వింటిని. కారణంబేమి?

రుక్మాంగదుఁడు—ప్రియా! నాప్రయాణంబు నీకెవరు దెలిపిరి?

సంధ్యావళి—ఇటులనే కర్ణాకర్ణికగ వింటిని.

రుక్మాంగదుఁడు—సఖీ! ప్రయాణోద్దేశంబుఁ దెలిపినవారు తత్కారణంబుఁ దెలుపరైరా? నీవు విననైతివియా?

సంధ్యావళి—నాథా! నేనితరులచే నొంతవినియుండినను మీనోట విననుఁ గుతూహలపడుచున్నదానను.

రుక్మాంగదుఁడు—సారసాక్షీ! రాజులప్పుడప్పుడు తమరాజ్యమెల్ల సంచరించి చిత్రవిచిత్రంబులు గనుట ధర్మముగాదా?

సంధ్యావళి—నాథా! చిత్రవిచిత్రంబులు రాజులుండు పట్టణంబులలోనుండును. అరణ్యంబులలో నేమియుండును?

రుక్మాంగదుఁడు—సారసాననా! వింధ్యారణ్య పరిసరప్రాంత్యంబుల ఋషికులావతంసు లనేకులు తపంబాచరించుచుందురు. వారి భద్రం బరయుట రాజులకు భద్రంబుం గాన నదియొక పనిగ నెంచి ప్రయాణమైతిని.

సంధ్యావళి—నాథా! అదిముఖ్యోద్దేశంబుగ నుండదు, నిజము మఱుఁగుపఱచిన నమ్మువారెవరు?

గీ॥ నిజము మఱుఁగుపఱచి నీవెన్ని పలికిన
నమ్మరాదనే మనమ్మునందు?
నీటిలోన నూనె తేటతెల్లముఁగాఁగఁ
దేలునటుల నిజము తేలుచుండు॥

నాథా! నిజము పలుకుము. సందేహవచనంబులు వలదు.

రుక్మాంగదుఁడు—నాళీకాననా! అదియేమి ప్రాపంచికచిత్రమోగాని యెంతటివయసుచెల్లిన పురుషులనుగాని జారులని వారిపత్నులు